Follow: @ANNTELUGU
24-06-2025
ANN తెలుగు
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్   సంపుటి- 22   సంచిక- 201   పేజీలు-08   వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్


## రేవంత్‌కు లోకేశ్ థ్యాంక్స్



- ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతులకు తెలంగాణ ప్రభుత్వం నిధులు
- హర్షం వ్యక్తం చేసిన ఏపీ మంత్రి లోకేశ్

02

## సాయంత్రంలోగా నిన్ను చంపేస్తాం



- ఎంపీ రఘునందన్ కు బెదిరింపు
- డీజీపీ, ఎస్పీకి ఫిర్యాదు చేసిన నేత

02

## గప్పా గప్పా గుద్ది..రప్పా రప్పా జైల్లో వేయాలి



- కేసీఆర్ ముసలోడు వచ్చే ఎన్నికల్లో పోటీ చెయ్యడు
- 3.0 కాదు.. వాళ్ల మొహాలకు మూడు సీట్లు వస్తే గొప్ప
- ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

02



## అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి

ఖతర్‌లోని ఎయిర్ బేస్‌పై క్షిపణులు

ప్రతీకార దాడులు షురూ

యుద్ధం ప్రారంభించింది అమెరికా..

ముగించేది మేమే అంటున్న ఇరాన్

వివరాలు 2లో



## గుజరాత్ ఉపఎన్నికలో బీజేపీకి అనూహ్య షాక్

- ఆప్ అభ్యర్థి ఇటాలియా సంచలనం
- గుజరాత్ అసెంబ్లీకి త్వరలోనే సాధారణ ఎన్నికలు
- ఉప ఎన్నిక ఫలితంతో ఖంగుతిన్న బీజేపీ

వివరాలు 2లో




## 76,842 రేషన్ కార్డులు రద్దు

- ఆరు నెలలుగా రేషన్ తీసుకోక పోవడమే కారణం
- రద్దు చేయాల్సిన కార్డుల జాబితాను కలెక్టర్లకు పంపిన కేంద్రం

వివరాలు 2లో

## ట్రిపుల్ ఆర్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

- రైతు భరోసా పూర్తయిన నేపథ్యంలో.. రైతులతో ప్రత్యేక సమావేశాలు
- గోదావరి జలాల్లో చుక్క కూడా వదులుకోం
- కాళేశ్వరం కమిషన్ కు 30లోగా వివరాలు అందజేయాలని నిర్ణయం
- నూతన క్రీడా పాలసీకి ఆమోదం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం.. తొలిసారి హాజరైన ముగ్గురు మంత్రులు
- వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- రైతు భరోసా విజయవంతంగా అమలుచేసిన ముఖ్యమంత్రికి మంత్రుల అభినందనలు



## చౌటుప్పల్ 2 సంగారెడ్డి

> **ముఖ్యమంత్రికి అభినందనలు**
>
> రైతుభరోసాను విజయవంతంగా అమలుచేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేబినెట్ మంత్రులు అభినందించారు. తొలిసారి కేబినెట్ సమావేశానికి నూతన మంత్రులు గడ్డం వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ భేటీలో వాకిటి శ్రీహరి శాఖకు సంబంధించిన నూతన క్రీడాపాలసీ కూడా ఆమోదించడం విశేషం.

చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ మేర ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సుదీర్ఘంగా భేటీ అయిన కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. రేపటితో రైతులందరికీ రైతుభరోసా పూర్తవుతుందని, 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల మొత్తాన్ని రైతులకు అందజేశామని తెలిపారు. రైతుభరోసా కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో రైతుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేబినెట్ నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నారు. - హైదరాబాద్

వివరాలు 3లో

## హైకోర్టులో.. పంచాయతీ

### సర్పంచ్ ఎన్నికలపై హైకోర్టులో వాదనలు పూర్తి

ఎన్నికల నిర్వహణకు 30 రోజుల గడువు కావాలని ప్రభుత్వం విజ్ఞప్తి

తయారీకి 60 రోజులు సమయం కోరిన రాష్ట్ర ఎన్నికల సంఘం

ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పు రిజర్వు




**హైదరాబాద్, మహా :** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ అంశంపై రాష్ట్ర హైకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ మరియు పిటిషనర్ల తరఫున వాదనలు సోమవారం ముగిశాయి. ఇరు పక్షాల వాదనలను విన్న ఉన్నత న్యాయస్థానం, తన తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో, పంచాయతీ ఎన్నికల భవితవ్యంపై ఉత్కంఠ నెలకొంది.

మిగతా 3లో

## రైతుకు భరోసా రేవంతన్న

### నిధుల ప్రక్రియను ఇవాళ పూర్తి చేస్తాం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

ఇచ్చిన మాట ప్రకారం చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం

గతంలో ఎప్పుడూ లేని విధంగా పెట్టుబడి సాయం

రైతుల సంక్షేమం కోసం రూ. లక్ష కోట్లు ఖర్చు చేశాం

**హైదరాబాద్, మహా:** సాగులో ఉన్న ప్రతి గుంటకు రైతు భరోసా నిధులు జమ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటివరకు 67.01 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 8284.66 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేసినట్లు తెలిపారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగులో ఉన్న మిగతా భూములకు కూడా రైతు భరోసా నిధుల ప్రక్రియను ఇవాళ పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కీలక ప్రకటన విడుదల చేశారు.

మిగతా 2లో



## జిల్లాల పర్యటనకు మీనాక్షి రెడీ

### పర్యటనకు రోడ్ మ్యాప్

పార్టీ బలోపేతంపై ఏఐసీసీ ఇంచార్జ్ నజర్

డీ లిమిటేషన్ కమిటీ, పీసీసీ పరిశీలకులతో భేటీ

పీసీసీ చీఫ్ తో కలిసి పలు సమావేశాలు నిర్వహించిన మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను నెలకొల్పడానికి విస్తృత పర్యటనలకు సిద్ధమవుతోంది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ త్వరలోనే రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించనున్నట్లు ప్రకటించారు.

మిగతా 2లో



## సిట్ ముందుకు మాజీ సీఎస్ శాంతికుమారి

- జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు
- కీలక సమాచారం రాబట్టిన అధికారులు
- ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తు ముమ్మరం



**హైదరాబాద్, మహా :** తీవ్ర కలకలం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తాజాగా రాష్ట్ర ప్రభుత్వ మాజీ సీఎస్ శాంతి కుమారి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి (పొలిటికల్) రఘునందన్ రావులను విచారించారు. వారిద్దరి నుంచి కీలక సమాచారం రాబట్టి, వాంగ్మూలాలను నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిబంధనల ప్రకారం, ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్ 1885, సెక్షన్ 5(2) కింద ఎవరి ఫోన్‌నైనా ట్యాప్ చేయాలంటే రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి లేదా డీజీపీ నుంచి అధికారిక అనుమతి తప్పనిసరి.

మిగతా 3లో

## త్వరలోనే కొత్త క్రీడా పాలసీ

- అన్ని రకాల క్రీడలకు ప్రాధాన్యత ఇస్తాం
- ఒలింపిక్ డే వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి

వివరాలు 2లో



# సాయంత్రంలోగా నిన్ను చంపేస్తాం

- ఎంపీ రఘునందన్ కు బెదిరింపు
- డీజీపీ, ఎస్ పీకి ఫిర్యాదు చేసిన నేత



**హైదరాబాద్, మహా :** మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు బెదిరింపు కాల్ వచ్చింది. మావోయిస్టుల పేరుతో ఫోన్ చేసి ఈ సాయంత్రం లోగా చంపేస్తామంటూ హెచ్చరించారు. తాము మధ్యప్రదేశ్ కు చెందిన మావోయిస్టుగా అగంతకుడు ఫోన్ కాల్ లో బెదిరించాడు. రఘునందన్ పీఏతో మాట్లాడిన అగంతకుడు ఈ సాయంత్రంలోగా చంపేస్తామంటూ హెచ్చరించాడు. వెంటనే దీనిపైన రఘునందన్ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసారు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి రఘునందన్‌రావు హాజరైన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్‌రావు పీఏ (పర్సనల్ అసిస్టెంట్) లిఫ్ట్ చేశారు. తనకు వచ్చిన బెదిరింపు కాల్‌పై రాష్ట్ర డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు రఘునందన్ ఫిర్యాదు చేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా స్థానికంగా కలకలం రేపింది. రఘునందన్ రావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషయంపై బీజేపీ అగ్రనేతలు ఎంపీ రఘునందన్‌రావుకి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. కాల్ నెంబర్ ఆధారంగా పోలీసులు విచారణ చేస్తున్నారు. ఎక్కడ నుంచి ఈ కాల్ వచ్చింది అనేది ఆరా తీస్తున్నారు. లోక్ సభ ఎన్నికల్లో మెదక్ నుంచి బీజేపీ ఎంపీగా గెలిచిన రఘునందన్ రావు పార్టీలో క్రియాశీలకం గా మారారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ లక్ష్యంగా పార్టీ వాయిస్ బలంగా వినిపిస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మూడు పార్టీలకు ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయంగా కీలకమైన ప్రాంతం. ఇదే ప్రాంతం నుంచి బీజేపీ నాయకుడిగా రఘునందన్ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు.




# గప్పా గప్పా గుద్ది..రప్పా రప్పా
# జైల్లో వేయాలి

## కేసీఆర్ ముసలోడు వచ్చే ఎన్నికల్లో పోటీ చెయ్యడు
## 3.0 కాదు.. వాళ్ల మొహాలకు మూడు సీట్లు వస్తే గొప్ప
## ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

**నిజామాబాద్, మహా:** రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఓటమి తప్పదని, ఆ పార్టీ నుంచి మాజీ మంత్రి హరీశ్ రావు మినహా మరెవరూ గెలిచే అవకాశం లేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతిలో పూర్తిగా కూరుకుపోయిందని ఆరోపించిన ఆయన, ఆ పార్టీ నాయకులను తక్షణమే అరెస్ట్ చేసి జైలుకు పంపించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం బెదిరించి, సాయంత్రం వారితోనే మిలాఖత్ అయితే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని ఆయన హితవు పలికారు. కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్, కవిత అలాగే హరీష్ రావు లను గపా గపా గుద్ది... రప్పా రప్పా అనుకుంటూ జైల్లో వేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ఫ్యామిలీలో ప్రతి ఒక్కరు స్కామ్ చేశారని ఫైర్ అయ్యారు.

**కేటీఆర్ కు అదే గతి..**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ జీవితం ముగించాలని ప్రయత్నిస్తున్న ఆమె అన్నయ్య కేటీఆర్ కు కూడా అదే గతి పట్టబోతోందని ఎంపీ అరవింద్ అన్నారు. కాళేశ్వరం స్కామ్‌లో కేసీఆర్‌ను, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ ఉన్నారన్నారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా త్వరలో నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారని ఆయన తెలిపారు. జూన్ 29వ తేదీన అమిత్ షా నిజామాబాద్‌కు విచ్చేసి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ పర్యటనలో భాగంగా, రైతుల చిరకాల వాంఛ అయిన పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్ షా ప్రారంభిస్తారని ఎంపీ అరవింద్ పేర్కొన్నారు. ఈ పరిణామం పసుపు రైతులకు ఒక నూతన శకాన్ని ఆరంభిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి అమిత్ షా తన పర్యటనలో భాగంగా, నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవంతో పాటు, దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత డి. శ్రీనివాస్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరిస్తారని ఎంపీ అరవింద్ తెలిపారు. అనంతరం, స్థానిక పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 'రైతు సమ్మేళనం' పేరుతో ఒక భారీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమ్మేళనంలో అమిత్ షా పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.



# త్వరలోనే కొత్త క్రీడా పాలసీ

- అన్ని రకాల క్రీడలకు ప్రాధాన్యత ఇస్తాం
- ఒలింపిక్ డే వేడుకల్లో మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో కొత్త క్రీడా పాలసీ తీసుకురాబోతున్నామని, దానిలో అన్ని రకాల క్రీడలకు ప్రాధాన్యం ఇస్తామని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ఒలింపిక్ డే వేడుకల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. త్వరలోనే క్రీడా పాలసీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలుపనుందని చెప్పారు. సీఎం కప్ పోటీలను నిర్వహించి గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను వెలికి తీసి జాతీయ స్థాయికి వెళ్లేలా ప్రోత్సహిస్తామన్నారు. ఇందుకోసం ప్రసిద్ధి చెందిన కోచ్లను నియమిస్తామన్నారు. ఒలింపిక్ పథకాలు సాదించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ఇప్పటికే బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహ్మద్ సిరాజ్ కు డీఎస్పీ పోస్టులు ఇచ్చి గౌరవంగా సన్మానించామన్నారు. అలాగే రాష్ట్ర ఐటీ శాఖల ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం శుభవార్త చెబుతుందని అన్నారు. ఈరోజు జరిగే కేబినెట్ భేటీలో క్రీడా పాలసీకి ఆమోదం తెలపనుందని చెప్పారు.

# రేవంత్ కు లోకేశ్ థ్యాంక్స్


## ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతులకు తెలంగాణ ప్రభుత్వం నిధులు
## హర్షం వ్యక్తం చేసిన ఏపీ మంత్రి లోకేశ్

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతుల కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. 'తెలుగు ప్రజల ఆత్మగౌరవ నినాదం, తెలుగు జాతి వెలుగు సంతకం, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మహానాయకుడు ఎన్టీఆర్ స్మృతి వనం అయిన ఎన్టీఆర్ ఘాట్‌కు రూ.1.35 కోట్ల వ్యయంతో హెచ్ఎండీఏ మరమ్మతులు చేపట్టడం చాలా సంతోషం. ఎన్టీఆర్ ఘాట్ మరమ్మతులకు నిధులు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని నారా లోకేశ్ తన ట్వీట్‌లో స్పష్టం చేశారు.



# 76,842 రేషన్ కార్డులు రద్దు

- ఆరు నెలలుగా రేషన్ తీసుకోక పోవడమే కారణం
- రద్దు చేయాల్సిన కార్డుల జాబితాను కలెక్టర్లకు పంపిన కేంద్రం



హైదరాబాద్, మహా : ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులకు రేషన్ కార్డులను తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంగతి తెలిసిందే. రేషన్ కార్డుల ద్వారా చాలా పథకాలు రాష్ట్రంలో అమలు అవుతున్నాయి. కానీ గత కొంతకాలంగా వేలాది మంది ప్రజలు రేషన్ కార్డులు ఉన్నా.. వాటిని వినియోగించుకుని రేషన్ తీసుకోవడం లేదు. అలాంటి వారిపై రాష్ట్ర పౌరఫరాల శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వరుసగా 6 నెలల పాటు రేషన్ తీసుకోని వారి కార్డులను రద్దు చేసేందుకు పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. అన్ని మండలాల నుంచి అధికారులు ఇప్పటికే సమాచారాన్ని సేకరించారు. గత ఆరు నెలల్లో రేషన్ తీసుకోని వారి వివరాలను అధికార యంత్రాంగం పరిశీలించింది. ఇందులో ఒక్కసారి కూడా రేషన్ తీసుకోని 76,842 రేషన్ కార్డులు ఉన్నట్లు తేలింది. దీంతో ఈ మొత్తం కార్డులను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ సర్కారు నిర్ణయించింది. ఈ వివరాలను పౌరసరఫరాల శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపించడంతో పాటు కొద్ది రోజుల్లోనే వారిని రేషన్ లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపింది. కలెక్టర్ల నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా 76,842 రేషన్ కార్డుల్లో ఉన్నా అనర్హులను గుర్తించి త్వరలోనే వారి కార్డులను రద్దు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ తెలిపింది. కనీసం 6 నెలలుగా రేషన్ తీసుకోని వారి జాబితాను కేంద్ర సర్కారు ఇటీవలే రాష్ట్రానికి పంపింది. ఈ క్రమంలోనే పౌరసరఫరాల శాఖ ఆ జాబితాను అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపించి క్షేత్రస్థాయిలో విచారణ చేయించింది. ఈ విచారణలో 76,842 రేషన్ కార్డులను అనర్హమైనవిగా తేల్చారు. కొందరు లబ్ధిదారులు మరణించినా వివరాలు అప్డేట్ కాలేదు. మరికొద్ది మంది ఆధారాలు వివరాలు తప్పుగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. మరికొందరు ఈకేవైసీ పూర్తి చేయలేదు. త్వరలోనే అనర్హుల రేషన్ కార్డులు తొలగిపోనున్నట్లు తెలిసింది. రద్దయ్యే రేషన్ కార్డులు అధికంగా హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, మేడ్చల్ జిల్లాల్లో ఉన్నారని కేంద్ర సర్కారు పంపిన జాబితా ఆధారంగా తెలిసింది. రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 91.83 లక్షలకు చేరింది. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 2 లక్షల రేషన్ కార్డులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# గుజరాత్ ఉపఎన్నికలో బీజేపీకి అనూహ్య షాక్

## ఆప్ అభ్యర్థి ఇటాలియా సంచలనం
## గుజరాత్ అసెంబ్లీకి త్వరలోనే సాధారణ ఎన్నికలు
## ఉప ఎన్నిక ఫలితంతో ఖంగుతిన్న బీజేపీ

**అహ్మదాబాద్, మహా :** గుజరాత్ లో దశాబ్దాలుగా అధికారంలో కొనసాగుతున్న బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. విసవాదరా నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి అనూహ్య షాక్ తగిలింది. ఆప్ నిలబెట్టిన మాజీ పోలీసు అధికారి గోపాల్ ఇటాలియా బీజేపీ అభ్యర్థి కిరీట్ పటేల్ పై సంచలన విజయం సాధించారు. ఏమాత్రం అంచనాల్లేకుండా బరిలోకి దిగిన ఆప్ అభ్యర్థి ఇటాలియా ఏకంగా 17554 ఓట్ల తేడాతో ఘన విజయం అందుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ నుంచి గెలిచిన భూపేంద్ర భయానీ 2023 డిసెంబర్ లో ఆ పార్టీకి గుడ్ బై చెప్పి అధికార బీజేపీలో చేరిపోయారు. దీంతో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయడంతో అప్పటి నుంచీ ఈ సీటు ఖాళీగా ఉంది. ఈ సీటుకు తాజాగా నిర్వహించిన ఉప ఎన్నికలు ఉత్కంఠ రేపాయి. అధికార బీజేపీ కూడా ఈ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకుని కిరీట్ పటేల్ ను రంగంలోకి దించింది. అయితే జనం మాత్రం ఆప్ ను మోసం చేసి బీజేపీలో చేరిన భూపేంద్ర వ్యవహారంపై ఆగ్రహంగా ఉన్నారు. ఈ ప్రభావం ఉప ఎన్నికలపై పడింది. దీంతో ఆప్ నిలబెట్టిన మాజీ పోలీసు అధికారి ఇటాలియా గెలుపొందారు.



బోటాడ్ కు చెందిన గోపాల్ ఇటాలియా పోలీసు అధికారిగా కెరీర్ ప్రారంభించి అనంతరం సామాజిక కార్యకర్తగా మారారు. 2017లో ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ మద్యపాన నిషేధం ఉల్లంఘనలపై సీఎం నితిన్ పటేల్ కు ఫిర్యాదు చేసి సంచలనం రేపారు. సీఎంకు ఆయన చేసిన వీడియో కాల్ వైరల్ కావడంతో ఆయన అవినీతి వ్యతిరేక పోరాటానికి బీజాలు పడ్డాయి. రాజకీయాల్లోకి రాక ముందు పటీదార్ రిజర్వేషన్ల పోరాటంలోనూ ఆయన పాల్గొన్నారు. 2020లో ఆప్ లో చేరిన ఇటాలియా రాష్ట్ర ఉపాధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత ఆప్ రాష్ట్ర అధ్యక్షుడయ్యారు. గతంలో పేపర్ లీక్ ఆందోళనలు, రైతుల తరపున పోరాటాలు చేసిన ఇటాలియాను వారే ఇప్పుడు గెలిపించారు.

# జిల్లాల పర్యటనకు మీనాక్షి రెడీ

## పర్యటనకు రోడ్ మ్యాప్
## పార్టీ బలోపేతంపై ఏఐసీసీ ఇంచార్జ్ నజర్
## డీ లిమిటేషన్ కమిటీ, పీసీసీ పరిశీలకులతో భేటీ
## పీసీసీ చీఫ్ తో కలిసి పలు సమావేశాలు నిర్వహించిన మీనాక్షి నటరాజన్

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇక పర్యటనలకు ముందు నియోజకవర్గ స్థాయి నేతలతో ఆమె కీలక సమావేశాన్ని నిర్వహించి.. పార్టీ కార్యక్రమాల అమలుకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మీనాక్షి నటరాజన్ పార్టీ శ్రేణులకు 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ఈ నినాదం మహాత్మాగాంధీ (బాపు) అహింసా సిద్ధాంతం, డా. బి.ఆర్. అంబేద్కర్ (భీమ్) సామాజిక న్యాయం, భారత రాజ్యాంగ (సంవిధాన్) పరిరక్షణకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని చాటి చెబుతుంది.

**లీడర్ల మధ్య తేడా లేకుండా..**

రాజ్యాంగ పరిరక్షణ కోసం 'జై సంవిధాన్' కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచాలని ఆమె నేతలకు దిశానిర్దేశం చేశారు. ఇది రాజ్యాంగ విలువల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులపై ఉందని మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించి.. వాటిని లబ్ధిదారులకు చేరువ చేయడంలో స్థానిక నాయకులు కీలక పాత్ర పోషిస్తారు. ఇది ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తుంది. మీనాక్షి నటరాజన్ పార్టీలో సీనియర్, జూనియర్ తేడా లేకుండా సమన్వయంతో కలిసి పనిచేయాలని నేతలకు సూచించారు. ఇది అంతర్గత విభేదాలను తగ్గించి.. పార్టీని బలోపేతం చేయడానికి అవసరం అవుతుంది. రాబోయే జిల్లా పర్యటనల సందర్భంగా.. ఒక్కో గ్రామంలో నియోజకవర్గ నేతలు రాత్రి బస చేసి, పరిసరాలను శుభ్రం చేయాలని ఆమె ఆదేశించారు. నామినేటెడ్ పోస్టులు రాని వారికి పార్టీలో, ప్రభుత్వంలో తగిన చోటు కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు.



# అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి

**ఖతర్‌లోని ఎయిర్ బేస్ పై క్షిపణులు**

- ప్రతీకార దాడులు షురూ
- యుద్ధం ప్రారంభించింది అమెరికా
- ముగించేది మేమే అంటున్న ఇరాన్

**మహా :** అణు స్థావరాలపై దాడులకు ప్రతీకారంగా అమెరికా కు సర్వశక్తులతో బదులిస్తామని ఇరాన్ హెచ్చరించిన విషయం తెలిసిందే. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా మారింది. పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను టెహ్రాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశాలు ఉన్నాయంటూ అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలోనే ఖతార్ రాజధాని దోహాలో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఖతార్ తన గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు ప్రకటించిన కొద్దిసేపటికే ఈ పేలుడు శబ్దాలు వినిపించడం గమనార్హం. ఖతార్‌లోని అమెరికాకు చెందిన అల్ ఉదీద్ ఎయిర్ బేస్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ స్థావరం పశ్చిమాసియాలోనే అతిపెద్దది. ఇక్కడ దాదాపు 10 వేలమంది అమెరికన్ సైనికులు ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ సోమవారం సైతం హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. యుద్ధం ప్రారంభించింది అగ్రరాజ్యమే అయినప్పటికీ.. ముగింపు పలికేది మాత్రం తామేనని పేర్కొంది. ఈ క్రమంలోనే త్వరలోనే పశ్చిమాసియాలోని తమ బలగాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టే అవకాశం ఉందని అమెరికా వర్గాలు అంచనా వేశాయి. అయితే.. దౌత్యపరమైన పరిష్కారానికే తాము మొగ్గుచూపుతున్నట్లు చెప్పాయి. టెహ్రాన్ ప్రతీకార దాడులు చేస్తే.. మరింత విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. ఈ పరిణామాల నడుమే ప్రతీకార దాడులు చోటుచేసుకోవడం గమనార్హం.



'కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్' ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి పశ్చిమాసియాలో దాదాపు 40 వేలమంది సైనికులను అమెరికా మోహరించింది. ఈజిప్టు, ఇరాక్, జోర్డాన్, ఖతర్, సిరియా, సౌదీ అరేబియా తదితర దేశాల్లోని దాదాపు 19 ప్రాంతాల్లో వాషింగ్టన్ సైనిక స్థావరాలు ఉన్నట్లు సమాచారం. వీటిలో ఖతర్‌లోని అల్ ఉదీద్ ఎయిర్ బేస్ అతిపెద్దది. ఇక్కడ దాదాపు 10 వేలమంది సైనికులు ఉన్నారు. ఈ స్థావరంలో గత రెండు వారాల నుంచి దాదాపు 40 మిలిటరీ విమానాలు అదృశ్యమైన శాటిలైట్ చిత్రాలు ఇటీవల బయటకు వచ్చాయి. ఇరాన్ దాడుల నుంచి తమ ఆస్తులను రక్షించుకోవడం కోసమే అమెరికా వాటిని తరలించి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

# రైతుకు భరోసా రేవంతన్న


(మొదటిపేజీ తరువాయి)

రైతుకు భరోసా.. రేవంతన్న అనేలా ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే వానాకాలం రైతు భరోసా ప్రక్రియను పూర్తి చేసి, రైతులపై తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు. జూన్ 16 న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకున్న రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు రెండు ఎకరాల వరకు రూ. 2349.83 కోట్లు, రెండో రోజు 3 ఎకరాల వరకు 3901.73 కోట్లు, మూడో రోజు 4 ఎకరాల వరకు 5215.26 కోట్లు, నాలుగో రోజు 5 ఎకరాల వరకు 6404.70 ఎకరాలు, ఐదో రోజు 7 ఎకరాల వరకు 7310.59 కోట్లు, ఆరో రోజు 9 ఎకరాల వరకు 7770.83 కోట్లు, ఏడో రోజు 15 ఎకరాల వరకు 8284.66 కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు.

**ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే ..**

ఇంత తక్కువ రోజుల్లోనే రైతు భరోసా నిధుల జమ ప్రక్రియను పూర్తి చేయడం రాష్ట్ర చరిత్రలోనే మొట్టమొదటిసారి అని వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్న.. ఎలాంటి రాజీ పడకుండా వానాకాలం రైతు భరోసా పథకాన్ని పూర్తి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆనందంలో మునిగిపోయారని అన్నారు. ఇప్పటికే రైతుల సంక్షేమం కోసం మా ప్రభుత్వం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసిందని, కానీ ఇవేమి కనబడని ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వంపై విమర్శలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఇప్పటికైనా మా ప్రభుత్వం రైతులకు చేస్తున్న మంచిని గ్రహించి దురుద్దేశంతో చేసే విమర్శలు మానుకోవాలని, రైతులకు మేలు చేసే ఆలోచనలతో ముందుకురావాలని హితవు పలికారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రైతు భరోసా నిధులను ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లోనే పూర్తి చేసిన సందర్భంగా సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రైతు పండుగ కార్యక్రమంలో సాయంత్రం 6 గంటలకు రైతులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతారని తెలిపారు. సీఎంకి కృతజ్ఞతలు పూర్వకంగా ప్రజా ప్రతినిధులు రైతులతో కలిసి వారి వారి నియోజకవర్గాల్లో, మండలాల్లో, గ్రామాల్లో పెద్ద ఎత్తున పాల్గొని ఈ రైతు పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## నిధుల ప్రక్రియను ఇవాళ పూర్తి చేస్తాం
## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి
## ఇచ్చిన మాట ప్రకారం చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం
## గతంలో ఎప్పుడూ లేని విధంగా పెట్టుబడి సాయం
## రైతుల సంక్షేమం కోసం రూ. లక్ష కోట్లు ఖర్చు చేశాం



మహా పత్రిక 03
మంగళవారం, హైదరాబాద్ | 24-06-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM

# చౌటుప్పల్ టు సంగారెడ్డి

## ట్రిపుల్ ఆర్‌కు కేబినెట్ గ్రీన్ సిగ్నల్

రైతు భరోసా పూర్తయిన నేపథ్యంలో.. రైతులతో ప్రత్యేక సమావేశాలు
గోదావరి జలాల్లో చుక్క కూడా వదులుకోం
కాళేశ్వరం కమిషన్ కు 30లోగా వివరాలు అందజేయాలని నిర్ణయం
నూతన క్రీడా పాలసీకి ఆమోదం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశం.. తొలిసారి హాజరైన ముగ్గురు మంత్రులు
వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
రైతు భరోసా విజయవంతంగా అమలుచేసిన ముఖ్యమంత్రికి మంత్రుల అభినందనలు



**హైదరాబాద్:** చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201కి.మీ మేర ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సుదీర్ఘంగా భేటీ అయిన కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. భేటీలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. రేపటితో రైతులందరికీ రైతుభరోసా పూర్తవుతుందని, 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల మొత్తాన్ని రైతులకు అందజేశామని తెలిపారు. రైతుభరోసా కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో రైతుల సమక్షంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేబినెట్ నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లోనూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించనున్నారు. "వ్యవసాయం దండగ కాదు.. పండుగ అనేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తెలంగాణ నీటి వాటాను ఏపీకి అప్పగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. బనకచర్ల బంకను మా ప్రభుత్వానికి రుద్దాలని ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్తాం. గోదావరి జలాల్లో ఒక్క చుక్క కూడా వదులుకోవద్దని నిర్ణయం తీసుకున్నాం. గోదావరి జలాల విషయంలో జులై మొదటి వారంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రభుత్వ వాదనలు వినిపిస్తాం. కాళేశ్వరంపై ఈనెల 30లోపు కమిషన్‌కు పూర్తి వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం. కాళేశ్వరానికి గత ప్రభుత్వ మంత్రివర్గ ఆమోదం ఉందా? లేదా? వివరాలు ఇవ్వాలని నిర్ణయించాం'' అని పొంగులేటి వివరించారు. నూతన క్రీడా పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. క్రీడా కోటాలో రిజర్వేషన్లు పెంచాలని, క్రీడాకారులను ప్రోత్సహించేలా పారితోషికాలు ఇవ్వాలని నిర్ణయించింది.

# హైకోర్టులో.. పంచాయతీ

## సర్పంచ్ ఎన్నికలపై హైకోర్టులో వాదనలు పూర్తి

ఎన్నికల నిర్వహణకు 30 రోజుల గడువు కావాలని ప్రభుత్వం విజ్ఞప్తి
తయారీకి 60 రోజులు సమయం కోరిన రాష్ట్ర ఎన్నికల సంఘం
ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పు రిజర్వు




**(మొదటిపేజీ తరువాయి)**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం 2024 ఫిబ్రవరిలో ముగిసినా ఎన్నికలు సకాలంలో నిర్వహించడం లేదని, వెంటనే ఎన్నికలు జరిపేలా ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాదాపు ఆరు వేర్వేరు పిటిషన్లు హైకోర్టులో దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై గత కొంతకాలంగా ధర్మాసనం విచారణ జరుపుతోంది. తాజాగా జరిగిన విచారణలో, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసుకునేందుకు తమకు కేవలం నెల రోజుల గడువు సరిపోతుందని ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. మరోవైపు, ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా పూర్తి చేయడానికి కనీసం 60 రోజుల సమయం అవసరమని రాష్ట్ర ఎన్నికల సంఘం ధర్మాసనాన్ని కోరింది. ప్రభుత్వం, ఎన్నికల సంఘం తమ తమ వాదనలను సమర్పించాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కూడా తమ వాదనలను వినిపించారు.

# డిసెంబర్ నాటికి తెలంగాణ విజన్ డాక్యుమెంట్

## సంగారెడ్డి జిల్లాలో మరో రెండు కొత్త మునిసిపాలిటీలు

## ప్రతి మూడు నెలలకోసారి స్టేటస్ రిపోర్ట్ మీటింగ్.. కేబినెట్ లో కీలక నిర్ణయాలు ఇవే

**హైదరాబాద్, మహా:** తెలంగాణ కేబినెట్ సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం జరగ్గా, అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్ తో పాటు ప్రతీ మూడు నెలలకోసారి కేబినెట్ నిర్ణయాలపై స్టేటస్ రిపోర్ట్ మీటింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. కొత్త మునిసిపాలిటీల ఏర్పాటుతో పాటు పలు మునిసిపాలిటీల అప్ గ్రేడ్ కు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**కీలక నిర్ణయాలు ఇవే**

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వానాకాలం పంటలకు పెట్టుబడి సాయం రైతు భరోసాను విజయవంతంగా రికార్డు వేగంతో అందించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రైతునేస్తం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం 9 రోజుల్లో 9వేల కోట్లు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. కోటీ 49 లక్షల ఎకరాలకు ఈ సాయాన్ని పంపిణీ చేసింది. ఇంత తక్కువ వ్యవధిలో రాష్ట్రంలోని దాదాపు 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా సాయం అందించిన ఘనత మా ప్రభుత్వానిది. ఈ శుభ సందర్భాన్ని రైతుల సమక్షంలోనే ఉత్సవంగా జరుపుకోవాలని కేబినేట్ నిర్ణయం తీసుకుంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు సెక్రటేరియట్ ఎదురుగా రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద 2 వేల మంది రైతులతో 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహిస్తుంది. అన్ని జిల్లాల్లో రైతు వేదికలతో పాటు మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ సంబరాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ప్రతీ జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం. డిసెంబర్ 9వ తేదీన అన్ని జిల్లాల్లో ఈ విగ్రహాలను ఆవిష్కరించాలని నిర్ణయం హైదరాబాద్ చుట్టూ నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్ దక్షిణ భాగం అలైన్ మెంట్ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. ఆర్ అండ్ బీ విభాగం తయారు చేసిన మూడు ప్రతిపాదనలను ఈ సందర్భంగా కేబినెట్ పరిశీలించింది. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు 201 కిలో మీటర్ల పొడవు ఉండే అలైన్ మెంట్ కు తుది ఆమోదం తెలిపింది. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఏపీ తలపెట్టినగోదావరి బనకచర్ల ప్రాజెక్ట్ ను వ్యతిరేకించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని ఇప్పటికే కేంద్ర జల వనరుల శాఖ మంత్రిని ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి స్వయంగా ఢిల్లీకి వెళ్లి కలిసి విజ్ఞప్తి చేశారు.. చట్టపరంగా, న్యాయపరంగా బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టాలని, అన్ని వేదికలను ఉపయోగించుకోవాలని కేబినెట్ తీర్మానించింది. రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న అంశాలపై రెండు తెలుగు రాష్ట్రాల అధికారుల కమిటీ సమావేశంలో చర్చించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు పై పీసీ ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై కేబినెట్ చర్చించింది. కాళేశ్వరం ప్రాజెక్టు కు సంబంధించి ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న పూర్తి వివరాలను ఈ నెల 30 లోగా కమిషన్ కు అందివ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో సీనియర్ అధికారులకు ఈ బాధ్యత ను అప్పగించింది.

రాష్ట్రంలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించేలా, క్రీడా ప్రమాణాలను పెంపొందించేలా రూపొందించిన తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ ని కేబినెట్ ఆమోదించింది. ఈ పాలసీ లో భాగంగా తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు ఆఫ్ గవర్నెన్స్ ఏర్పాటు చేస్తారు. తెలంగాణ క్రీడా అభివృద్ధి నిధి ని ఏర్పాటు చేస్తుంది. జిల్లాలో క్రీడా అభివృద్ధికి ప్రతి ఏడాది జిల్లా కలెక్టర్ల అధ్వర్యంలో ఉండే క్రూషియల్ బ్యాలెన్స్ ఫండ్ లో పది శాతం కేటాయించాలన్న నిర్ణయాన్ని ఆమోదించింది. స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లకు అర్హత జాబితాలో సీఎం కప్ రాష్ట్ర స్థాయి విజేతలకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది.

తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీ డాక్యుమెంట్ రూపొందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. డిసెంబర్ 9 న తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించాలని నిర్ణయించారు. తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, ప్రణాళికల తయారీకి వివిధ రంగాల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయి ప్రముఖులు, నిపుణులతో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనేది లక్ష్యం. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుంది . అన్ని శాఖలు, అన్ని విభాగాలు ఇందులో భాగస్వామ్యం పంచుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఆశించిన వృద్ధి లక్ష్యంగా ఎంచుకునే కార్యక్రమాలు, చేపట్టాల్సిన కార్యాచరణను విజన్ డాక్యుమెంట్ లో పొందుపరుస్తారు. విజన్ డాక్యుమెంట్ తయారీకి నీతి అయోగ్ తో పాటు, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ రాష్ట్ర ప్రభుత్వానికి నాలెడ్జ్ పార్టనర్ గా వ్యవహరిస్తారు. కేంద్రం ప్రకటించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా అన్ని రంగాల్లో సుస్థిర సమ్మిళిత అభివృద్ధి, రాష్ట్రం లో మౌలిక సదుపాయల వృద్ధి తో పాటు మహిళలు, రైతులు, యువకుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. దేశ ఎకానమీలో పదో వంతు సంపదను అందించే రాష్ట్రంగా తెలంగాణ వృద్ధి సాధించాలనే భారీ లక్ష్యం తో ఈ విజన్ రూప కల్పన చేయాలని కేబినెట్ అధికారులకు దిశా నిర్దేశం చేసింది.

పరిపాలన సంస్కరణల్లో భాగంగా ఇకపై ప్రతి మూడు నెలలకోసారి కేబినెట్ మీటింగ్ ను స్టేటస్ రిపోర్ట్ మీటింగ్ గా నిర్వహించాలని నిర్ణయం. ఆ మూడు నెలల్లో జరిగిన కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు పై యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను ఈ ప్రత్యేక భేటీ లో సమర్పించి చర్చిస్తారు. ఈ మూడు నెలల ప్రత్యేక భేటీకి మంత్రివర్గం తో పాటు అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు ఈ సమావేశం లో పాల్గొంటారు. సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో పాటు ఇస్నాపూర్ మున్సిపాలిటీని అప్ గ్రేడ్ చేయాలని నిర్ణయించింది.

# సిట్ ముందుకు మాజీ సీఎస్ శాంతికుమారి

**(మొదటిపేజీ తరువాయి)**



దీంతో పాటు, కేంద్ర ప్రభుత్వ టెలికమ్యూనికేషన్ విభాగం (డాట్) నుంచి కూడా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ట్యాప్ చేయాలనుకుంటున్న ఫోన్ నెంబర్ల జాబితాను ముందుగా ఒక రివ్యూ కమిటీ క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. ఆ కమిటీ ఆమోదం తెలిపిన తర్వాతే అనుమతి కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపిస్తారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ప్రభాకర్ రావు నేతృత్వంలోని రాష్ట్ర ప్రత్యేక నిఘా విభాగం (ఎస్ఐబీ) సుమారు 618 ఫోన్ నెంబర్లను ట్యాపింగ్ చేసేందుకు రివ్యూ కమిటీకి ప్రతిపాదించినట్లు సమాచారం. అప్పట్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శాంతి కుమారి, ఆ జాబితాను టెలికం అనుమతుల నిమిత్తం డాట్‌కు పంపారని సిట్ దర్యాప్తులో వెల్లడైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వాస్తవానికి ఎస్ఐబీ అధికారులు ఇచ్చిన ఫోన్ నంబర్లు ఎన్ని అన్న అంశాలతో పాటు అధికారులు ఇచ్చిన నంబర్లు ఎవరివి అన్న అంశాలను తెలుసుకున్నారా? తెలుసుకుంటే ఎవరిని గుర్తించారు, ఎందుకు రాజకీయ నేతలకు సంబంధించిన పేర్లను అనుమతించాల్సి వచ్చింది, ఒక వేళ రాజకీయ నేతలవి కావని భావిస్తే ఎవరిని అనుమతించారు అ



# మహంకాళి బోనాలకు రండి

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆహ్వానం

హైదరాబాద్, మహా: జులై 13న సికింద్రాబాద్ లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న బోనాల మహోత్సవాల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆలయ అధికారులు ఆహ్వానించారు. సోమవారం సెక్రటేరియట్ లో మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ అధికారులు ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి ఉజ్జయిని మహంకాళి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. మరో వైపు ఈ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

# ఆధారాలు చూపిస్తే అవాకులు, చవాకులా

- ముమ్మాటికీ కాళేశ్వరం అవినీతి ప్రాజెక్టే
- బండి సంజయ్ పై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై మండిపడ్డ ఎమ్మెల్యే రాజాసింగ్



హైదరాబాద్, మహా : కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధారాలతో సహా బయటపెట్టగానే బీఆర్ఎస్ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. బండి సంజయ్ పై బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ముమ్మాటికి అవినీతి ప్రాజెక్టేనని అన్నారు. అందులో మా పార్టీది, నాది ఒకే అభిప్రాయమన్నారు. ప్రధాని నరేంద్రమోడీ చెప్పినట్లు బీఆర్ఎస్ పార్టీ కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలాగా వాడుకుందన్నారు. ఇది వాస్తవం అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై ప్రధాని మోడీ, అమిత్ షా, జేపీ నడ్డా చెప్పిన మాటలే మా స్టాండ్ అని ప్రకటించారు. బీఆర్ఎస్ నేతల వైఖరి చూస్తుంటే ఉల్టా చోర్ కోత్వాల్ కు డాంటే అన్నట్లుందన్నారు. రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రీ డిజైన్ పేరుతో రూ.1.20 లక్షల కోట్లు పెంచింది వాస్తవమా? కాదా అని బీఆర్ఎస్ నేతలు ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. నాడు స్వయం ప్రకటిత ఇంజనీరుగా అవతారం ఎత్తి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును చేపడితే నేడు ఆయన సుపుత్రుడు ఎన్డీఎస్ఏ కంటే తానే తెలివైన మేధావిగా ప్రవర్తించడం సిగ్గుచేటన్నారు.

# డ్రగ్స్ కేసులో ప్రముఖ హీరో శ్రీరామ్ అరెస్ట్

**చెన్నై, మహా :** తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ నటుడు శ్రీకాంత్‌ను డ్రగ్స్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. నటుడు కొకైన్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. దీని కోసం పోలీసులు అతనిని విచారిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి చెందిన శ్రీకాంత్ సినిమాలలో నటించాలనే కోరికతో చిన్నప్పుడే చెన్నై వెళ్లిపోయాడు. శ్రీకాంత్ పేరును కాస్త శ్రీరామ్‌గా మార్చుకుని చిన్న చిన్న పాత్రల్లో నటించడం ప్రారంభించాడు. అనంతరం 'రోజా పూలు' అనే చిత్రంతో తెలుగు, తమిళంలో ఎంట్రీ ఇచ్చాడు. "ఒకరికి ఒకరు" అనే సినిమాతో మంచి పేరు సంపాదించి తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో పలు సినిమాల్లో నటించి మెప్పించాడు. ఇటీవల శ్రీరామ్ "హరికథ" అనే వెబ్ సిరీస్‌లోనూ అలరించాడు. ఈ సీనియర్ నటుడిని డ్రగ్స్ కేసులో చెన్నైలోని నుంగంబాకం పోలీసులు అరెస్ట్ చేశారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వాస్పత్రిలో నటుడు శ్రీరామ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం నుంగంబాకం పోలీస్ స్టేషన్‌కు శ్రీరామ్‌ను తరలించి సుమారు 2 గంటలుగా చెన్నై నార్కోటిక్స్ ఇంటెలిజెన్స్ యూనిట్ పోలీసులు విచారిస్తున్నారు.

# స్వదేశానికి వచ్చే తెలంగాణ వాసులకు అండగా ఉండాలే...

- సరైన వసతి, ప్రయాణ సౌకర్యం కల్పించాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు



**హైదరాబాద్, మహా:** ఆరుగురు తెలంగాణ విద్యార్థులు అదివారం అర్ధరాత్రి న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. వీరిలో నలుగురు ఇరాన్ నుంచి.. ఇద్దరు ఇజ్రాయెల్ నుంచి సురక్షితంగా వచ్చారు. అందరూ హైదరాబాద్‌కు ముందస్తు విమానాలను బుక్ చేసుకోగా.. సోమవారం ఉదయం 5:30 గంటలకు హైదరాబాద్ బయలుదేరే వరకు తెలంగాణ భవన్ సిబ్బంది వారికి సహాయం చేశారు. మరో ఏడుగురు తెలంగాణ పౌరులు ఇజ్రాయెల్ నుంచి జోర్డాన్‌లోని అమ్మాన్‌కు సురక్షితంగా చేరుకున్నారు. త్వరలోనే న్యూఢిల్లీకి చేరుకోనున్న వీరి కోసం అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

**స్వదేశానికి వచ్చే ప్రతి..**

ఇజ్రాయెల్ గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేయడం వల్ల ఇబ్బందులు తలెత్తినప్పటికీ ఈ సవాళ్లను అధిగమించి, ప్రభావిత పౌరులందరికీ సహాయం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. విదేశాంగ మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయాలు, సంబంధిత అధికారులతో తెలంగాణ ప్రభుత్వం నిరంతర సమన్వయంతో పనిచేస్తోంది. స్వదేశానికి వచ్చే ప్రతి తెలంగాణ నివాసికి సకాలంలో సహాయం, సరైన వసతి, తదుపరి ప్రయాణ సౌకర్యం అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పౌరులంతా అధికారిక మార్గాలనే అనుసరించాలని, ధృవీకరించని సమాచారంపై ఆధారపడరాదని సూచనలు జారీ అయ్యాయి. ఈ క్లిష్ట సమయంలో తెలంగాణ ప్రభుత్వం పౌరులకు అండగా నిలుస్తూ వారి భద్రతకు, త్వరితగతిన స్వదేశానికి రప్పించేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తోంది.

# రైతు భరోసా ఎగ్గొట్టినందుకా సంబరాలు?

- 15 వేలు ఇస్తానని.. 12 వేలు ఇస్తున్నందుకా?
- మేము 11 సార్లు ఇచ్చినా ఎలాంటి సంబరాలు చేయలే
- మాజీ మంత్రి హరీశ్ రావు కీలక వ్యాఖ్యలు

**నర్సాపూర్, మహా:** వానాకాలం పంటకు రైతులు సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను వారి ఖాతాల్లో జమ చేస్తుంది. రైతులకు డబ్బులు అందడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ సర్కార్ రేపు రైతు భరోసా సంబరాలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ రైతు భరోసా సంబరాలపై హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టినందుకు సంబరాలు చేయాలా?.. రూ. 15 వేలు ఇస్తానని చెప్పి రూ. 12 వేలు ఇస్తున్నందుకు సంబరాలు చేయాలా..? రైతు బీమా, రుణమాఫీ, పంటల బీమా చేయనందుకా, సన్న వడ్లకు బోనస్ ఎగ్గొట్టినందుకు సంబరాలు చేయాలా అని ప్రశ్నించారు. చెత్త ట్రాక్టర్లో డీజిల్ లేక సోమవారం నర్సాపూర్ పర్యటనలో భాగంగా హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తో కలిసి చిప్పల్ తుర్తి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోని చెత్త ట్రాక్టర్లో డీజిల్ లేక 20 రోజులుగా చెత్త సేకరించడం లేదన్నారు. గ్రామాలు స్వచ్ఛంగా ఉండాలని కేసీఆర్ ట్రాక్టర్లు ఇస్తే వాటిలో డీజిల్ పోయని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. హస్తం పార్టీ అన్న మార్పు ఇదేనా? పల్లేలపై మీకు ఉన్న పట్టింపు ఇదేనా అని ప్రశ్నించారు. లగచర్ల, ధన్వాడ రైతులకు బేడీలు వేసి జైలుకు పంపినందుకు సంబరాలు చేయాలా అంటూ ప్రశ్నించారు. 'రైతులకు ఎరువులు దొరక్క ఇబ్బందులు పడుతున్నందుకు సంబరాలు చేయాలా.. ఇదేనా రైతులపై సీఎం రేవంత్ కి ఉన్న ప్రేమ..?.. మీకు నిజాయితీ ఉంటే ఎగ్గొట్టిన రైతు భరోసా ఇచ్చి సంబరాలు చేయండి.. కేసీఆర్ 11 సార్లు రైతు బంధు ఇస్తే ఎలాంటి ఉత్సవాలు చేయలేదు.. కేసీఆర్ నాట్లకు నాట్లకు రైతు బంధు వేస్తే ఓట్లకు ఓట్లకు రేవంత్ రైతు భరోసా ఇస్తున్నాడు.. గాంధీ భవన్ లో గొర్రెలు తీసుకుపోయి యాదవులు తమ నిరసన వ్యక్తం చేశారు. పరిపాలన అంటే ప్రతి పక్షాలపై అక్రమ కేసులు పెట్టడం కాదు ప్రజలకు సేవ చేయాలి అని' హరీశ్ రావు మండిపడ్డారు.



Z కేటగిరీ

# బీజేపీలో బీఆర్ఎస్ విలీనం... ఒక అవగాహన!

"బిజెపితో పొత్తుపెట్టుకుంటున్నారనే భావన ప్రజల్లో కలుగుతోంది.ఎల్కతుర్తి సభలో బీజేపీపై అటాక్ చేయలేదు" అని ఎమ్మెల్సీ కవిత తన తండ్రిని వేసిన ప్రశ్నకు పార్టీ హైకమాండ్ నుంచి జవాబు లేదు. జవాబు లేక కాదు,జవాబు చెప్పలేక. జవాబు చెప్పడం ఇష్టం లేక. బిఆర్ఎస్ రజతోత్సవసభలో కేసీఆర్ ప్రసంగ సారం ఏమిటంటే,తమకు ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీ. బీజేపీ కానే కాదు. ఆయన వ్యాఖ్యలను బట్టి బిజెపీతో స్నేహం ఉందని కాదు,లేదా పొత్తులు పెట్టుకుంటామనీ కాదు. కానీ చాలా వ్యూహాత్మకంగా 'ఒక వాక్యూమ్'ను జనానికే వదిలేశారు.



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్




జనంలో కవిత మాటలు బలంగా దూసుకుపోయాయి. రెండు పార్టీల మైత్రి ఉందనో,లేదా 'విలీనానికి' ప్రయత్నాలు జరిగాయనో మరొకరెవరైనా అంటే ఆ వ్యాఖ్యలను తేలికగా కొట్టిపారవేసే వాళ్ళు. సాక్షాత్తు కేసీఆర్ కూతురే ఈ మాటలు అంటున్నారంటే బీజేపీ,బిఆర్ఎస్ లు 'రహస్యంగా చెట్టాపట్టాలు' వేసుకొని తిరుగుతున్నట్టుగా ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఇలాంటి చర్చ తనకు ఇష్టం ఉన్నా,లేకపోయినా కవితే ఈ చర్చకు ఉత్ప్రేరకం. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి అనూహ్యంగా లభించిన ఒక 'మారణాయుధం.!

''మా పార్టీలో ఎవరైనా తమ అభిప్రాయం చెప్పుకునే స్వేచ్ఛ ఉంది.బహిరంగంగా పార్టీలో అంతర్గత విషయాలు మాట్లాడటం సరైనది కాదు.అది మా అంతర్గత విషయం.'' అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.ఆయన కవిత పేరు ప్రస్తావించదలచుకోలేదు.ఎమ్మెల్సీ కవిత లేఖ అంతర్గత విషయం ఎలా అవుతుంది? ఆమె తమ కుటుంబ వ్యవహారాలు మాట్లాడడం లేదు. ఆస్తుల గురించి మాట్లాడడం లేదు. పార్టీ రాజకీయ వైఖరి గురించి మాట్లాడారు. పార్టీ అవలంబిస్తున్న విధానాల గురించి ప్రశ్నించారు. బిఆర్ఎస్ 'ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ' కాదు. లేదా 'కేసీఆర్ అండ్ సన్స్' పేరిట తెరచిన దుకాణం అంతకన్నా కాదు. వందలాది మంది యువకుల బలవన్మరణం తర్వాత పరిస్థితి తీవ్రతను కాంగ్రెస్ హైకమాండ్ గుర్తించింది. ఎల్.బీ.నగర్ చౌరస్తాలో వేలాదిమంది జనసమూహం చూస్తుండగానే,తెలంగాణ కోసం తనకు తాను నిప్పంటించుకొని నిలువెల్లా 'దహించుకు'పోయిన శ్రీకాంతాచారి ఘటన టీవీలలో చూస్తూ సోనియాగాంధీ కన్నీళ్లు పెట్టుకున్నట్టు అప్పట్లో టెన్ జన్ పథ్ వర్గాలు చెబుతుండేవి. దాదాపు నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతూ సోనియా గాంధీ పుణ్యాన ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రమిది.టిఆర్ఎస్ పేరిట పార్టీ పెట్టి తానే ఉద్యమాన్ని నడిపినట్టు,తానే ఒక ఉద్యమం అయినట్టు చెప్పుకునే కేసీఆర్ తెలంగాణ ప్రజలు నెత్తిన పెట్టుకొని పూజించిన మనిషి.తెలంగాణ పేరిట ఏర్పడిన పార్టీ తెలంగాణ ప్రజల సొత్తు.అందరికీ అందులో భాగస్వామ్యం ఉన్నది.అందరికీ అందులో సమాన వాటా ఉంటుంది.ఇక ఇందులో 'అంతర్గత' వ్యవహారాలు ఏమిటి?

బిఆర్ఎస్ అంటే తెలంగాణ,తెలంగాణ అంటే బిఆర్ఎస్,ఇంటి పార్టీ,ప్రజల పార్టీ అని బిఆర్ఎస్ నాయకులే డప్పు కొట్టుకుంటున్నప్పుడు ప్రజల్లో ఉన్న అనుమానాలు,అపోహలు తొలగించవలసిన బాధ్యత కేసీఆర్ లేదా కేటీఆర్ పైన ఉన్నది.ప్రజలకు వస్తున్న వచ్చిన అనుమానాలను నివృత్తి చేయాలి.పార్టీలో జరుగుతున్న పరిణామాలపై స్పష్టత ఇవ్వాలి.ఆ పరిణామాలేమిటో తెలుసుకునే హక్కు ప్రజలకుంది.కానీ అవేవీ ఇప్పటి వరకు జరగలేదు.''సొంత పార్టీలో నాపై కుట్రలు జరుగుతున్నాయి.నన్ను టార్గెట్ చేశారు'' అని కవిత ప్రకటన చేసిన తర్వాత అంతా మౌనంగానే ఉండవలసిన అవసరం ఏమిటి?ఇదే అంతుచిక్కని ప్రశ్న.కవిత ఆరోపణలు నిరాధారమని అయినా చెప్పాలి.లేదా ఆమె ఆరోపణలను పార్టీ పరిశీలిస్తున్నట్టు అయినా చెప్పాలి.అంతేకానీ తప్పించుకోవడమొక్కటే మార్గం అనుకుంటే నిస్సందేహంగా పార్టీకి తీరని నష్టం కలిగిస్తుంది.

''ప్రియమైన డాడీ అంటూ మొదలుపెట్టి,బిజెపితో పొత్తుపెట్టుకుంటున్నారనే భావన ప్రజల్లో కలుగుతోంది. ఎల్కతుర్తి సభలో బీజేపీపై అటాక్ చేయలేదు'' అని అసమ్మతి స్వరంతో కేసీఆర్‌కు కవిత మే 2 న లేఖ రాశారు. మే 22వ తేదీన ఆ లేఖను 'ఎవరో' లీకు చేశారు.అది మీడియాకు చిక్కింది.ఆ లేఖ,అందులోని అంశాలపై ఎడతెగని చర్చ సాగుతూనే ఉన్నది.అనేక కథనాలు ,విమర్శలు షికార్లు చేస్తూనే ఉన్నాయి. అయితే ఇంత జరుగుతున్నా బిఆర్ఎస్‌లో మాత్రం నిశ్శబ్ధం కనిపిస్తోంది.అయితే ఈ నిశ్శబ్దం స్మశాన నిశ్శబ్దం వలె ఉన్నది. కేసీఆర్ మౌనానికి కారణాలేమిటో తెలియదు.

రాజకీయపార్టీలలో అలకలు,అసమ్మతి,అసంతృప్తి,బుజ్జగింపులు సర్వసాధారణం.బిఆర్ఎస్ ఇందుకు మినహాయింపు కాదు.అటువంటి 'బులెట్ ప్రూఫ్ జాకెట్' వేసుకొని కేసీఆర్ లేరు. రాజకీయాల్లో సందిగ్ధం,అయోమయం ఎప్పుడూ మంచివి కావు.పార్టీ క్యాడర్‌ను,ప్రజల్ని విశ్వాసంలోకి తీసుకొని తమ పార్టీ వైఖరిని వెల్లడించాలి.బిఆర్ఎస్ పార్టీ హైకమాండ్ అంటే ఇద్దరే! ఒకరు కేసీఆర్,మరొకరు కేటీఆర్.''మాకు ప్రజలే హైకమాండ్''అని చాలా సందర్భాల్లో బహిరంగసభల్లో కామెంటు చేసి ప్రజాదరణ పొందాలనుకునే బిఆర్ఎస్ నాయకులు ''మేము కూడా తెలంగాణ జెండా పట్టిన వాళ్ళం.మేము కూడా ఓనర్లమే'' అని ఎవరు అన్నా తక్షణం వారిని నిర్దాక్షిణ్యంగా బయటకు గెంటివేసిన సందర్భాలు బిఆర్ఎస్ పార్టీ ప్రత్యేక లక్షణం.

కవిత లేఖ రాస్తే తప్పేముంది? ఆమె కూడా బిఆర్ఎస్‌లో ఓ కీలకనేతే కదా అని మొదట అనుకున్నారు. కానీ శంషాబాద్ ఎయిర్ పోర్టు సాక్షిగా మే 23 న ఆమె చేసిన విమర్శలతో పార్టీ పెద్ద కుదుపునకు లోనయ్యింది.వివాదం మరింత ముదిరి సంక్షోభం దిశగా పరిణామాలు వెడుతున్నవి.''కేసీఆర్ దేవుడే,ఆయన చుట్టూ కొన్ని దెయ్యాలున్నాయి''.అనే మాటలో చాలా అర్థాలున్నవి.ఆమె పార్టీ లైన్ దాటి మాట్లాడుతున్నారంటూ కొందరు నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు.ఒక్కమాటలో చెప్పాలంటే తన తండ్రి పార్టీ నడుపుతున్న తీరునే ఆమె వేలెత్తి చూపించింది.ఇదే అదనుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు అధికారపార్టీ నాయకులు 'ఆయన దెయ్యాల నాయకుడంటూ' కేసీఆర్ పై విమర్శలతో రెచ్చిపోతున్నారు

అలుపెరుగని 'రాజకీయ శిఖరాని'కి కూతురు రూపంలో పెద్ద గండం ముంచుకొచ్చింది.గతంలో ఎన్నడూ ఎదురు కాని ప్రశ్న ఎదురైంది. సమాధానం చెప్పినా,మౌనంగా ఉన్నా ఏం చేసినా నష్టం మాత్రం తప్పదు.ఇప్పుడున్న పరిస్థితిలో ఏం చేయాలి, కూతురిపై చర్యలు తీసుకోవాలా, లేక లైట్ తీసుకుని ముందుకు సాగాలా అనే సందిగ్ధత కేసీఆర్ ను వెంటాడుతున్నది.కవిత ఏ ముహూర్తాన లేఖ రాశారో కానీ,బీజేపీ,బిఆర్ఎస్ మధ్య 'ఏదో తెలియని బంధం'ఉన్నట్టు జనం నమ్ముతున్నారు.గ్రాడ్యుయేట్,టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పోటీ చేయలేదు.పోటీకి ఎందుకు దూరంగా ఉండవలసి వచ్చిందో పార్టీ హైకమాండ్ స్పష్టం చేయనందున పార్టీ క్యాడర్ లో,జనంలో అనుమానాలు రావడం సహజం.అదే అంశాన్ని కవిత ప్రస్తావించారు.

అలాగే తెలంగాణలో హాట్ టాపిక్ గా ఉన్న షెడ్యూల్డ్ కులాలు,వెనుకబడిన తరగతుల గురించి రజతోత్సవసభలో కేసీఆర్ మాట్లాడకపోవడాన్ని ఆమె తప్పుబట్టారు.కవిత లేవనెత్తిన అంశాలు,ప్రస్తావించిన సమస్యలు నిజానికి పార్టీ బలోపేతానికి ఉపయోగపడే విషయాలు.కేసీఆర్ కు సలహాలు,నిర్మాణాత్మక సూచనలు ఎవరు చెప్పినా వినరు.తనకు తెలిసిందే సంపూర్ణం అన్నది ఆయన భావన.తన తండ్రికి విమర్శలు,సూచనలు నచ్చవన్న సంగతి కవితకు తెలియదని ఎలా అనుకుంటాం? కానీ ఆమె ఒక రాయి విసిరి చూశారు.తీరా అది క్షిపణిలా ఆ పార్టీపైనే విరుచుకుపడింది. ఇప్పుడేంచేయాలి?కవిత విషయంలో ఎలా ముందుకెళ్లాలి?షోకాజ్ ఇచ్చి వదిలించుకోవచ్చునా? వదిలేసి సర్దుకుపోవచ్చునా? ఒకవేళ కేసీఆర్ సర్దుకుపోయే వైఖరి ప్రదర్శించినా కవిత ఇక్కడితో వదిలేలా లేరు.మరోసారి పార్టీపై ఇంతే స్థాయిలో విమర్శలు చేస్తే,ఉన్న పరువు కాస్తా గంగలో కలుస్తుందేమోనన్న భయమూ వెంటాడుతోంది.ఈ వ్యవహారంపై పార్టీ అధ్యక్షుడు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారనే ఆసక్తి సొంత పార్టీలో పతాకస్థాయికి చేరింది.''బీఆర్ఎస్‌లో అందరూ యజమానులే'' అంటూ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఈటల చేసిన కామెంట్స్,కేసీఆర్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించాయి.ఈటలను పార్టీ నుంచి నిర్దాక్షిణ్యంగా గెంటివేసేదాకా కేసీఆర్ కు కునుకు పట్టలేదు.

పార్టీ లైన్ దాటి బహిరంగ విమర్శలు చేస్తే పరిణామాలు ఇలాగే ఉంటాయనే సంకేతాలు ఇచ్చారు.పార్టీ లైను అంటే 'కేసీఆర్ లైను' మాత్రమే.ఆయన నిర్ణయమో,ఆలోచనో ఏదైనా అదే 'ఫైనల్' మాట.పునరాలోచన,సమీక్ష అంటూ ఏమీ ఉండవు.
మరి కవిత కూడా ఈటల మాదిరే పార్టీలో లోపాలను ఎత్తిచూపారు.'పార్టీలో దయ్యాలు' ఉన్నాయంటూ మీడియా ముందే విమర్శించారు. దీంతో కేసీఆర్ రాజకీయ అగ్నిపరీక్ష ఎదుర్కొంటున్నారు. దీన్ని ఎలా అధిగమిస్తారో చూడవలసి ఉన్నది.పార్టీ నిర్ణయం ఎలా ఉన్నా,తాను 'సిద్ధం' అన్నట్లు ఆమె సంకేతాలు ఇస్తున్నారు.నియోజకవర్గాల వారికీ తెలంగాణ జాగృతి కమిటీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. సింగరేణి జాగృతి ఏర్పడింది.జూన్ 14 న విద్యార్థి సంఘాలు,కార్యకర్తలతో సమావేశం జరిపారు.సామాజిక తెలంగాణ కోసం పోరాటాలు చేయవలసిందిగా ఆమె పిలుపునిచ్చారు.పోలవరం బ్యాక్ వాటర్ అంశం, ముంపు సమస్యలు,ఏపీలో విలీనం చేసిన మండలాలపై కవిత జూన్ 20 న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.బిఆర్ఎస్ పార్టీ పరంగా చేయవలసిన కార్యక్రమాలను ఆమె తెలంగాణ జాగృతి పేరిట నిర్వహిస్తున్నారు.కవిత దూకుడు రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యపరుస్తోంది.

తండ్రికి రాసిన లేఖలో సొంత పార్టీలో పేరుకుపోయిన అసంతృప్తిని 'ఫీడ్‌బ్యాక్' పేరుతో కవిత బయటపెట్టారు.కవిత లేఖపై కానీ,కవిత చేసిన,చేస్తున్న కామెంట్స్‌పై కానీ ఎవరూ స్పందించే సాహసం చేయడం లేదు.తండ్రీ కూతురి మధ్య గ్యాప్ వచ్చినట్టు స్పష్టంగా కనబడుతున్న దృశ్యం.'ఆ దెయ్యాలు ఎవరు? కోవర్టులు ఎవరు'? అనే ప్రశ్నలు ప్రజల నుంచి కూడా వినిపిస్తున్నాయి.కవిత లేఖ ఎలా బయటకు వచ్చిందో తేలవలసి ఉన్నది.ఆమె పార్టీ వైఖరికి భిన్నంగా ప్రవర్తిస్తున్నారనే సందేశం పార్టీ క్యాడర్ కు వెళ్లేందుకే సొంత మనుషులే ఈ పని చేసి ఉండవచ్చు.కవితకు ప్రత్యర్థులు ఇంటా, బయటా పుష్కలంగా ఉన్నారు.ఉమ్మడి నిజామాబాద్ జిలాకు చెందిన పలువురు బిఆర్ఎస్ నాయకులకు కవిత అంటే అసలు గిట్టదు.ఆ జిల్లా నాయకులు,కింది స్థాయి ప్రజాప్రతినిధులంతా కేటీఆర్ శిబిరంలో ఉన్నారు.'కేటీఆర్ ముఖ్యమంత్రి అయితే తమకు పదవులు, హోదా,వైభవం లభిస్తాయని' వాళ్ళందరి అభిప్రాయం. వాళ్ళ దృష్టిలో కవిత,హరీశ్ రావు శివాలయం వంటి వారు.కేటీఆర్ వైష్ణవాలయం వంటి వ్యక్తి.కనుక లాభం ఎక్కడ ఉంటే అక్కడే చేరడం రాజకీయ నాయకుని లక్షణం.

కవిత లేఖ లీకైన తరువాత కేటీఆర్ ఎక్కడా నోరు విప్పలేదు.పార్టీ అంతర్గత వ్యవహారం కావడంతో బయటకు మాట్లడలేదనుకుంటే, విషయం బయటకు వచ్చిన తరువాత కూడా కవితను తిరిగి మీడియా ముందు మాట్లడకుండా నిలువరించలేకపోయారు.కేసీఆర్ తరువాత పార్టీలో పట్టున్న కేటీఆర్, తన సోదరి చేసిన ఆరోపణలపై లేఖ తండ్రికి అందిన రోజే సీరియస్‌గా దృష్టిపెట్టి ఉంటే పరిస్థితి ఇక్కడ వరకూ వచ్చేదికాదన్న విశ్లేషణలున్నవి.కేటీఆర్ ఎందుకు ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నారో తెలియదు. ఆ స్థానంలో హరీశ్ రావు పరిస్థితిలో మరోలా ఉండేదని బిఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఒకరు అన్నారు.'ఇలాంటి సమస్యలు తలెత్తినపుడు ఒక అడుగు వెనక్కి వెయ్యాలి.ఒక మెట్టు దిగాలి. ఇందుకు సరైన మేనేజ్ మెంటు నైపుణ్యం ఉండాలి' అని ఆయన వ్యాఖ్యానించారు.

అలా చేసి ఉంటే పార్టీ గుట్టు తెలంగాణ భవన్,ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ దాటేది కాదు.కానీ అలా వ్యవహారం సర్దుబాటు చేయడంలో కేటీఆర్ విఫలమయ్యారనే వాదనలు వినిపిస్తున్నాయి.పార్టీలో కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయన్నది తీవ్ర ఆరోపణ.అంటే కేసీఆర్ చుట్టూ ఉన్న కొందరు వ్యక్తులు ఆయనను తప్పుదోవపట్టిస్తున్నట్టు అర్థం చేసుకోవచ్చు.ఎవరయినా తప్పుడు విషయాలు చెప్పినా,తప్పు దోవ పట్టించినా కేసీఆర్ తప్పుదోవపడుతున్నట్లయితే ఆయన నాయకత్వం బలహీనపడినట్టు భావించాలి.కనీసం లేఖ లీక్ చేసిన వారెవరే తేల్చి,చర్యలు తీసుకుంటామనే మాట కూడా కేటీఆర్ నోట రాలేదంటే అంతర్గత విభేదాలు ఏ స్థాయికి వెళ్లిపోయాయో సులభంగానే అర్థం చేసుకోవవచ్చును.

ఓవైపు సోదరి,మరోవైపు పార్టీ పరువు ,అంతర్గత విభేదాలు..ఇలా వీటిలో ఏ అంశాన్ని బహిరంగంగా మాట్లడినా అటు కాంగ్రెస్,ఇటు బిజెపిల విమర్శలకు అవకాశం ఇచ్చినట్లుంటుందని భావించి కేసీఆర్ మౌనమునిలా మారిపోయారేమో!! మామకోసం,మామ వెంట అంటూ కేసీఆర్‌కు నమ్మిన బంటులా, బీఆర్ఎస్‌కు వీర విధేయుడిగా ఉన్న హరీష్ రావు, కవిత పెట్టిన చిచ్చును ఆర్పే సాహసం చేయలేకపోతున్నారనే వాదనలున్నవి.కేసీఆర్ ఆదేశాలు లేకుండా తనకు తాను తలదూర్చి కొత్త సమస్యలకు తాను ఎందుకు కారకుడు కావాలని కూడా ఆయన అనుకుంటూ ఉండవచ్చు. బీఆర్ఎస్‌ను విమర్శించే పార్టీలపై ఆధారాలతో సహా చెలరేగిపోయే హరీష్ రావు, కవిత చేసిన ఆరోపణలపై మాత్రం మౌనంగా ఉండడం 'రాజనీతి' అని కొందరు అభిప్రాయపడుతున్నారు.హరీశ్ రావు ప్రాథమికంగా కేసీఆర్ రక్త సంబంధీకుడు కాదు.కేసీఆర్,కేటీఆర్, కవితల మధ్య రక్తసంబంధం ఉన్నది.అదీ కాకుండా 'జరగాల్సినదేదో' ఆ కుటుంబంలో తనకు సంబంధం లేకుండానే జరిగిపోతే,ఇక పార్టీని తన చుట్టే తిప్పుకోవచ్చునని హరీశ్ ఆలోచిస్తుండవచ్చు.ఎంతయినా మేనమామ పోలికలు ఎటు పోతాయన్నది కొందరు పరిశీలకుల అభిప్రాయం. తన రాజకీయ భవిష్యత్తుపై హామీ ఏంటని,పార్టీలో తన స్థానం ఏంటని కవిత ప్రశ్నించడాన్ని ఎట్లా తప్పుపడతాం.''బతుకమ్మ పేరిట తెలంగాణ సంస్కృతిని కాపాడడంలో,తెలంగాణ ఉద్యమానికి జాగృతి కార్యక్రమాలు జోడించడంలో కవిత గొప్పగా పనిచేశారు''అని పలు ఇంటర్వ్యూలలో కేసీఆర్,కేటీఆర్ చెప్పిన వీడియోలు వైరల్ అవుతున్నవి. తెలంగాణలో కేసీఆర్ కుమార్తెగా ప్రజలకు పరిచయం అయిన కవిత ఆ తర్వాత కాలంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు.అటు ఉద్యమంలో,ఇటు రాజకీయాల్లో తనకుంటూ ఓ స్థానం ఏర్పాటు చేసుకున్నారు. పార్టీలో కేసీఆర్ తర్వాత కేటీఆర్,హరీశ్ రావుకు ఎలాంటి ఫాలోయింగ్ ఉందో ఇంచుమించు అలాంటి ఫాలోయింగ్ ను కవిత కూడా సంపాదించుకున్నారు. కొత్తగా తనను తాను తెలంగాణ ప్రజలకు పరిచయం చేసుకోనక్కరలేని అవకాశం కవితకు ఉంది.

కవిత ఉద్యమ ప్రస్థానం ఓ పార్టీ పెట్టడానికి మంచి బలాన్ని ఇవ్వగలదా?లేదా?అనే ప్రశ్నలు నిన్నమొన్నటి దాకా తెలంగాణ సమాజంలో వైరల్ అయ్యాయి. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జాగృతి సంస్థను స్థాపించి,ఆ సంస్థతో తెలంగాణ భాష,సంస్కృతి,పండుగల పట్ల ప్రజల్లో ఓ చైతన్యాన్ని తీసుకురావడంలో ఆమె సక్సెస్ అయ్యారు.ఈ సంస్థ ద్వారా తెలంగాణ ప్రజలో ఓ 'సంబంధాన్ని' ఏర్పరచుకోగలిగారు.తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు ఈ సెంటిమెంట్ ఏదో రూపంలో ఉపయోగపడుతుందన్న వాదన ఉన్నదే.'సొంత కుంపటి' ఏర్పాటు చేయడం సులభమూ కాదు,నిలదొక్కుకోవడం అంతకన్నా సులభమూ కాదు.అయితే 'తెలంగాణ జాగృతి' ఓ ఉత్ప్రేరకంగా ఉపయోగపడే అవకాశం ఉంది.తెలంగాణలోని గ్రామ స్థాయి వరకు తెలంగాణ జాగృతి సంస్థను కవిత విస్తరింప జేశారు.జాగృతి కార్యకర్తలు తెలంగాణ అంతటా ఉన్నారు. ఇతర రాష్ట్రాల్లోను, విదేశాల్లోను జాగృతి శాఖలు ఉన్నాయి. కొత్త పార్టీ పెట్టేందుకు ఈ పునాది కవితకు లాభిస్తుంది. కొత్తగా పార్టీ ఏర్పాటు చేసే లాంఛింగ్ సమస్యలు ఏవీ కవితకు వచ్చే అవకాశం లేదని ప్రచారం సాగింది. ఇలా తెలంగాణ జాగృతి సంస్థ కొత్త పార్టీ ఏర్పాటుకు 'లాంఛింగ్ పాడ్' లా ఉపయోగపడవచ్చునని పరిశీలకుల మాట.

లిక్కర్ స్కాంలో నిందితురాలిగా జైలుకు వెళ్లి వచ్చిన మరక మినహాయిస్తే తెలంగాణలో ప్రజాకర్షణ గల మహిళా రాజకీయ నాయకులలో కవిత ఒకరు. మహిళా ఓటర్లను తమ వైపు తిప్పుకునే శక్తి ఉన్న మహిళా నాయకులు తెలంగాణలో లేకపోవడం కవితకు అనుకూలించే అంశం.ఈ లోటును కవిత పూడ్చే అవకాశం ఉంది.మహిళలను ఆకట్టుకునే నాయకురాలిగా ఆమె ఎదిగే అవకాశం ఉంది. తెలంగాణ ఉద్యమం,తెలంగాణ జాగృతి సంస్థ,మహిళా రిజర్వేషన్లపై చేసిన కార్యక్రమాలు,కవితకు ఉన్న రాజకీయ అనుభవం కొత్త పార్టీ లేదా కొత్త 'సంస్థ' పెట్టేందుకు కలిసి రావచ్చు.ఉద్యమ నాయకురాలిగా,పార్లమెంట్ సభ్యురాలిగా,శాసనమండలి సభ్యురాలిగా ఉన్న అనుభవం పార్టీ నడపడంలో బలాన్ని ఇవ్వవచ్చు.

తన తండ్రి పార్టీని నడిపిన తీరు,సంక్షోభ సమయాలలో ఆయన తీసుకున్న నిర్ణయాలు వాటి వల్ల వచ్చిన విజయాలు,ఓటములు దగ్గర నుంచి చూసిన అనుభవం కూడా కలిసి వస్తుంది.కాంగ్రెస్,బీఆర్ఎస్,బీజేపీల పట్ల విముఖత ఉన్న నాయకులు,కార్యకర్తలు,ప్రజలు ఓ కొత్త ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారా,లేదా అనే సందేహాలు ఉన్నవి. దళిత, బహుజనులు,మైనారిటీలు,మహిళలను తన వైపునకు హైజాక్ చేసే చర్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ప్రణాళికా బద్ధంగా చేపడుతున్నారు.కనుక ఆ సెక్షన్లన్నింటినీ తన వైపునకు మళ్లించడం సాహసోపేత చర్య కాగలదు.ఆయా సెక్షన్ల ప్రజలను 'ప్రత్యమ్నాయ' రాజకీయాలతో కవిత ఎలా ఆకట్టుగోగలరన్నది చూడాలి.కవిత పెట్టే 'పార్టీ'లో వరదతో పాటు బురద కూడా రావచ్చు.ఇందుకు ఆమె సర్వ సన్నద్ధంగా ఉండాలి.తాలు,పుచ్చు ఏదో స్కాన్ చేసుకోగలగాలి.ఆమె దగ్గర 'ధనబలం' ఉందన్న ఆకర్షణతో 'భజన బృందాలు' రంగంలోకి దిగుతాయి. అలాంటి భజన బృందాల ట్రాప్ లో పడితే ఇక అంతే సంగతులు.

బిఆర్ఎస్ కు కుటుంబ పార్టీ అనే ముద్ర ఉన్నది. ఆ ముద్రను తొలగించుకొని వెలుపలికి రావడం సాధ్యమేనా అనే అనుమానాలున్నవి. విపక్షాలు,ప్రజల నుంచి వచ్చే రాజకీయ విమర్శలకు సరయిన సమాధానాలు ముందుగానే సిద్ధం చేసుకొని పెట్టుకోవాల్సి ఉంటుంది. లిక్కర్ స్కాం ఆరోపణలతో కవిత జైలుకు వెళ్లి రావడం ప్రతికూల అంశం.అయితే కేసు నుంచి కవిత బయటపడే వరకు విపక్షాలు కవితను రాజకీయంగా వెనక్కునెట్టే అస్త్రంగా లిక్కర్ స్కాం కేసును ఉపయోగిస్తాయి. ఇలాంటి ఆరోపణలకు దీటుగా జవాబు చెప్పగలిగితేనే ఆమెకు తెలంగాణ రాజకీయ రంగస్థలంలో ప్రత్యేక స్థానం లభిస్తుంది.ప్రస్తుత పరిస్థితుల్లో 'కొత్త పార్టీ' కి తెలంగాణలో రాజకీయ వాతావరణం అనుకూలంగా లేదనే వాదనలున్నవి. కాంగ్రెస్ అధికారంలో ఉండటం ,బీజేపీ క్రమంగా తన బలాన్ని పెంచుకుంటూ ఉన్న తరుణం ఇది.బీఆర్ఎస్ పార్టీ మరలా అధికారంలోకి రావడానికి గాను కేసీఆర్ ఎలాంటి ఎత్తుగడలు వేస్తారో చూడవలసి ఉన్నది.కవిత కొత్త పార్టీ పెట్టినా,పెట్టకపోయినా ఆమె రాజకీయ కార్యకలాపాలు నిస్సందేహంగా బీఆర్ఎస్‌కు భారీ నష్టం కలిగించనున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతూ వచ్చాయి.ఆ పార్టీ ఓటర్లలోనే పెద్దఎత్తున చీలిక వస్తుందని అనుకున్నారు.బిఆర్ఎస్ అసంతృప్త నేతలు,కార్యకర్తలు,ఓటర్లు కొద్ది మంది కవిత వైపు బదిలీ కావచ్చు.కాని ఇది కవితకు లాభం చేకూర్చేది కాకుండా కాంగ్రెస్,బీజేపీలకు లాభించే అవకాశం ఉన్నట్టు విశ్లేషణలు సాగుతున్నవి.

ఏ పార్టీ స్థాపించినా దానికో ప్రాతిపదిక, లక్ష్యం ఉండాలి.తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్,బీజేపీ,బీఆర్ఎస్,వామపక్షాల వంటి పార్టీలు ఇప్పటికే ఉన్నాయి. తనకు అన్యాయం జరిగిందని,రాజకీయంగా అణచివేశారని కవిత చెబితే ప్రజలు ఆమోదం తెలిపే స్థితిపై సవాలక్ష సందేహాలున్నవి.ఆమెపై ప్రజల్లో సానుభూతి రావాలి.కన్న తండ్రి,తోబుట్టువు ఆమెకు ద్రోహం చేశారని జనం నమ్మగలగాలి. బీఆర్ఎస్‌లో కవిత డైనమిక్ నాయకురాలు అనడంలో ఎవరికీ అనుమానాలు లేవు.కేసీఆర్ లాంటి 'లెంజడరీ' నాయకుడ్ని,కేటీఆర్,హరీశ్ రావు లాంటి రాజకీయ చతురత ఉన్న నేతలను కాదని కవిత తన రాజీకీయ భవిష్యత్తు కోసం నడిపే కార్యక్రమాలన్నీ 'వాళ్లకన్నా బెటర్' అనే భావన జనంలో రావలసి ఉన్నది.

బిఆర్ఎస్ లో 'మరో అధికార కేంద్రం ఉండరాదన్నది కేటీఆర్ ఫార్ములా' అనే ప్రచారం సాగుతోంది.కవిత, హరీశ్ రావులను 2029 లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయించే పథకానికి తండ్రీ,కొడుకు కలిసి మెరుగులు దిద్దారని గత ఏప్రిల్ లోనే ఒక ప్రచారం జరిగింది.తెలంగాణలో తాను మినహా మరో పోటీదారు ఉండకూడదని కేటీఆర్ అనుకుంటున్నారేమో తెలియదు.ఒకవేళ అదే నిజమని అనుకుంటే కేటీఆర్ కన్నా రాజకీయ అపరిపక్వ నాయకుడు మరొకరు లేరనే భావించాలి.

కాగా కవిత నడిపే కార్యక్రమాలేవీ పార్టీవ్యతిరేక కార్యకలాపాల కిందకు రావు.ఇంకా చెప్పాలంటే ఆమె వలన పార్టీ క్యాడర్ లో ఉత్సాహం కలుగుతోంది.కనుక కవితపై 'పార్టీ వ్యతిరేక కార్యకలాపాల' ముద్రతో చర్యలు తీసుకోలేరు.పార్టీ అధికారం కోల్పోయిన అనంతరం తక్షణం చేయవలసిన పనులేవీ పార్టీ అధినాయకత్వం చేయడం లేదు.ఏమేమి తప్పులు చేశారో వాటిని ఒప్పుకొని ప్రజలకు క్షమాపణలు చెప్పే దమ్ము కేసీఆర్,కేటీఆర్ లో కనిపించడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల వచ్చే 'నెగెటివ్ ఓటు' తాము అధికారంలోకి రావడానికి నిచ్చెనగా కేసీఆర్ భావిస్తుండవచ్చు.అయితే పార్టీని పోలింగు బూత్ స్థాయి నుంచి నిర్మించుకోవాలన్న ఆలోచనలు కానీ,అటువంటి ప్రయత్నాలు కానీ జరగడం లేదు.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946

# రాజధానిలో మరో ఆరుసంస్థలకు భూ కేటాయింపులు

## గతంలో భూకేటాయింపుల్లో 4 మార్పులు

### మంత్రివర్గ ఉపసంఘం సమావేశం తర్వాత ప్రెస్ మీట్ లో మంత్రి నారాయణ



**అమరావతి,మహా:** గత ప్రభుత్వ నిర్వాకం,మూడు రాజధానుల దెబ్బకు అమరావతి అంటే కొన్ని సంస్థలు భయపడి వెళ్లిపోయాయన్నారు మంత్రి నారాయణ. గతంలో భూకేటాయింపులు చేసిన సంస్థలు ఇప్పుడు సరిగా స్పందించడం లేదన్నారు...తాజాగా అమరావతిలో కొత్తగా 10 సంస్థలకు భూకేటాయింపులు చేస్తూ మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుందన్నారు... మొత్తం నాలుగు సంస్థలకు గతంలో చేసిన కేటాయింపుల్లో మార్పులు చేయగా,కొత్తగా ఆరు సంస్థలకు సబ్ కమిటీ కేటాయింపులు చేసింది..అయితే గతంలో కేటాయించిన రెండు సంస్థలకు భూముల కేటాయింపులు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది...సచివాలయంలో జరిగిన భూకేటాయింపుల మంత్రివర్గ ఉపసంఘం సమావేశానికి మంత్రులు నారాయణ,టీజీ భరత్ హాజరయ్యారు...మంత్రులు పయ్యావుల కేశవ్,దుర్గేష్ లు ఆన్ లైన్ ద్వారా హాజరయ్యారు.సమావేశం ముగిసిన తర్వాత మంత్రి నారాయణ మీడియాకు వివరాలు వెల్లడించారు. రాజధాని భూకేటాయింపుల సబ్ కమిటీ 18వ సమావేశం జరిగింది...మొత్తం 16 అంశాలకు గాను 12 అంశాలకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది...వీటిలో 201419 మధ్య కాలంలో భూములు కేటాయించిన పలు సంస్థలకు తిరిగి కేటాయింపుల్లో మార్పులు చేస్తూ సబ్ కమిటీ ఆమోదం తెలిపింది....సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్...సీబీఐకు రెండు ఎకరాలు అలాగే జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు రెండు ఎకరాలు,స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు ఐదు ఎకరాలు,ఆంధ్రప్రదేశ్ కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ కు మూడు ఎకరాలు కేటాయింపులను కొనసాగిస్తూ ఆమోదం తెలిపినట్లు మంత్రి నారాయణ చెప్పారు...ఈ నాలుగు సంస్థలకు గతంలో కేటాయించిన భూ కేటాయింపులను రివైజ్ చేసి ఆమోదం తెలిపాం..

అలాగే 2014 19లో కేటాయించిన రెండు సంస్థలకు భూ కేటాయింపులను రద్దు చేశాం. గెయిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అంబికా అగర్ బత్తి సంస్థకు చేసిన కేటాయింపులు రద్దు చేస్తూ కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈరోజు కొత్తగా మరో ఆరు సంస్థలకు భూ కేటాయింపులు చేసినట్లు మంత్రి చెప్పారు... ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్ కు రెండు ఎకరాలు,ఏపీ గ్రామీణ బ్యాంక్ కు రెండు ఎకరాలు,సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు 0.4 ఎకరాలు,ఇంటిలిజెన్స్ బ్యూరో (SIB) కి 0.5 ఎకరాలు,బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ కి 0.5 ఎకరాలు,బీజేపీ కార్యాలయానికి రెండు ఎకరాల చొప్పున కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నాం...201419 మధ్య కాలంలో 130 సంస్థలకు 1270 ఎకరాలు కేటాయించగా గత ప్రభుత్వ నిర్వాకం,మూడు ముక్కలాటతో పలు సంస్థలు భయపడి వెనక్కి వెళ్లిపోయాయి...ఆయా సంస్థలతో సంప్రదింపులు జరిపి తిరిగి కేటాయింపుల విషయంలో నిర్ణయం తీసుకుంటున్నాం...ఇప్పటివరకూ 64 సంస్థలకు 884 ఎకరాలు కేటాయించగా ఈరోజు మరో పది సంస్థలకు కేటాయింపులు పూర్తి చేసామన్నారు మంత్రి నారాయణ...భూకేటాయింపులు చేసిన సంస్థలు వీలైనంత త్వరగా నిర్మాణాలు ప్రారంభిస్తాయన్నారు...అమరావతిలో ఇప్పటికే పదివేలకు పైగా కార్మికులు పుల్లో నిమగ్నమయ్యారన్నారు...వర్షాలు తగ్గుముఖం పట్టేనాటికి మొత్తం 20వేల మంది కార్మికులతో పనులు శరవేగంగా కొనసాగుతాయని మంత్రి నారాయణ స్పష్టం చేసారు.

# ప్రైవేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల

- మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి ఎంఈఓ కృష్ణ
- 2024-2025 విద్యా సంవత్సరంలో 1135 మంది విద్యార్థులు
- కంప్యూటర్ ల్యాబ్ లు, పరిశుభ్రమైన టాయిలెట్లు
- ప్రతి తరగతి గదికి సీసీ కెమెరాలతో పర్యవేక్షణ
- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు




**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం ,మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని జిల్లెల గూడ లో ఉన్న చల్లా లింగారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో,ప్రైవేట్ పాఠశాల లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో వసతులు ఉన్నాయని ప్రధానోపాధ్యాయులు,బాలాపూర్ ఎంఈఓ కృష్ణ తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమం లో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించి,ప్రభుత్వ పాఠశాలల గురించి విస్తృత ప్రచారం నిర్వహించినట్టు కృష్ణ తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాల లో 24 గంటలు సీసీ కెమెరా పర్యవేక్షణ**

ప్రభుత్వ పాఠశాల లో ఎక్కడా లేని విధంగా 24 గంటల సీసీ కెమెరా పరిరక్షణ ఉంటుందని,తరగతి గదులు లో విద్యార్థుల పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని కృష్ణ తెలిపారు. ప్రభుత్వ నుండి బుక్స్, యూనిఫామ్,మధ్యాహ్న భోజనం,ఒంటి సౌకర్యాలను ఉచితంగా అందిస్తున్నామని తెలియజేశారు. 20222023 సంవత్సరం లో మన ఊరు,మన బడి కార్యక్రమం లో సెలెక్టర్ కావడం కావడం తో అన్ని అంగుల తో పాఠశాల లను రూపుదిద్దడం జరిగిందని కృష్ణ తెలిపారు. కంప్యూటర్ ల్యాబ్,క్రీడా ప్రాంగణం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం అందుబాటు లో ఉందని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించడం జరుగుతుందని తెలిపారు.

**ప్రభుత్వ పాఠశాలల పై తల్లిదండ్రులు నమ్మకం ఉంచండి**

ప్రవేట్ పాఠశాల లో అధిక ఫీజుల భారానికి బలికాకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. 1500 మంది విద్యార్థుల వరకు ఈ పాఠశాల లో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని కృష్ణ తెలిపారు. టీచర్ల కొరత పై డిఓ కి వివరించడం జరిగిందని,తక్షణమే స్పందించి జులై నాటికి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చినట్టు ఎంఈఓ కృష్ణ తెలిపారు.

**2024-2025 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు**

20242025 పదవ తరగతి విద్యా సంవత్సరం లో 540 మార్కులు వచ్చాయని అదే విధంగా 500 మార్కులు పైగా 15 మంది విద్యార్థులకు వచ్చాయని అన్నారు. జూలై ఫస్ట్ నుంచే పదవ తరగతి విద్యార్థులకు ఉదయ ఎనిమిది గంట నుండి సాయంత్రం 6 గంటల వరకు స్పెషల్ క్లాస్ రూమ్ నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా సాయంత్ర కాలం లో స్నాక్స్ సంబంధించి ధాతను వెతుకుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయులు స్పెషల్ క్లాసులకు సానుకూలంగా స్పందించి ఈ విద్యా సంవత్సరం లో 250 మంది పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడానికి రంగారెడ్డి జిల్లాలో ఉన్నతమైన మార్కులు సాధించడానికి మా ఉపాధ్యాయ బృందం కృషి చేస్తుందని తెలియజేశారు.

## కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయ నూతన ధర్మకర్తగా ముద్ద రాజేశ్వరి ప్రమాణ స్వీకారోత్సవం



**బాలాపూర్ మహా:** కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయ నూతన ధర్మకర్తగా ముద్ద రాజేశ్వరి ప్రమాణ స్వీకారోత్సవానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ హాజరయ్యారు. హనుమంతుని సమక్షం లో రాజేశ్వరి ప్రమాణ స్వీకారం తర్వాత శుభాకాంక్షలు తెలియజేశారు మధుయాష్కి గౌడ్. ఈ సందర్భంగా ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ దేవాలయ ధర్మకర్త లను ఘనంగా సన్మానించారు మీర్ పేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ముద్ద పవన్ కుమార్. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజేశ్వరి తెలిపారు. ప్రజల సహకారం తో ముందుకు వెళ్తామని రాజేశ్వరి అన్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి,ఈవో లావణ్య,ధర్మకర్తల తో కలిసి మధుయాష్కి గౌడ్ సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ఆలయం వెనుక భాగంలో ఉన్న పోచమ్మ అమ్మవారి దేవాలయం ముందు రోడ్డు నిర్మించాలని ఈవో కోరారు. డ్రైనేజీ సమస్య కూడా ఉందని పరిష్కరించాలని ఆలయ ఈవో లావణ్య కోరారు. స్పందించిన మధుయాష్కీ రోడ్డు,డ్రైనేజీ పైపు లైన్ నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టేలా అధికారుల తో మాట్లాడుతాను అన్నారు. తొందరలోనే ఆ పనులు పూర్తి చేయిస్తానని పేర్కొన్నారు. అదేవిధంగా ఆలయానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కు ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్ల పైనా చర్చించారు.



## ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మహా:** ప్రజావాణిలో అందే ఫిర్యాదులను పరిష్కరించే దిశగా సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో ఆయన పాల్గొని ఫిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. వారి సమస్యలను సావధానంగా ఆలకించిన అనంతరం వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. అనంతరం అయన మాట్లాడుతూ ఆర్జీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఎప్పటికపుడు వాటిని పరిష్కరించాలని సూచించారు. ప్రతి వారం ఆర్జీలను సమీక్షించి పెండింగ్ లో ఉండకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల అభ్యాసం, వినోదం, సంక్షేమంపై దృష్టి కేంద్రీకరించండి

### షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్ జి స్కూల్ ప్రారంభం



**షాద్ నగర్, మహా:** పాఠశాలకు వచ్చి విద్యార్థినీ విద్యార్థులకు చిన్నతనం నుండే విద్య, వినోదం, సంక్షేమంపై నిర్వాహకులు దృష్టి కేంద్రీకరించాలని షాద్ నగర్ శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం పట్టణంలోని రాచప్ప కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన కిడ్ జి స్కూలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. పాఠశాల ప్రిన్సిపల్ మహేష్, మౌనిక లను ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను పూల బొకేతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే చిన్నారులకు విద్యపై అవగాహన కల్పించడంతోపాటు వినోదం, సంక్షేమంపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రతి బిడ్డ యొక్క ప్రత్యేకతను, అనంతమైన సామర్థ్యాన్ని గుర్తించి బోధించేందుకు కృషి చేయాలని సూచించారు. చిన్నపిల్లల పై ఎక్కువగా భారం వెయ్యకుండా వారి సామర్థ్యానికి అనుగుణంగా విద్యను నిర్మించాలని సూచించారు. ఈ ప్రాంత ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు క్రమశిక్షణ తో కూడిన విద్య, నైపుణ్యం అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మహేష్ మాట్లాడుతూ కిడ్జీ స్కూల్ ద్వారా చిన్నారి విద్యార్థులకు వినోదంతో పాటు నైపుణ్యం కలిగిన విద్యను నేర్పించేందుకు కృషి చేస్తామని సూచించారు. రెండున్నర సంవత్సరాలు దాటిన చిన్నారులను మాత్రమే తమ పాఠశాలలోకి అనుమతిస్తున్నామని, వారి నుండి అడ్మిషన్స్ తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లే వరకు పూర్తి బాధ్యత తమ పాఠశాల తీసుకుంటుందని వివరించారు. కిడ్జి పాఠశాల ద్వారా చిన్నారి విద్యార్థిని విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్కిల్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మౌనిక, పి. నందిని, కే. నందిని తో పాటు పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



## పర్యావరణాన్ని కాపాడుదాం

### కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్, మహా ;** శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బలిదాన్ దివస్ సందర్భంగా సోమవార మైలర్ దేవపల్లి బిజెపి డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్ ఆధ్వర్యంలో డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి బిజెపి నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో మొక్కలను నాటారు. తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ప్రతి వార్డులో 100 మొక్కలను నాటాలని బిజెపి నాయకులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. పచ్చదనాన్ని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. బిజెపి పార్టీ మొక్కలా ఉండి నేడు వృక్షంలా మారింది అన్నారు. ప్రజల ఆదర అభిమానాలతో భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టబోతుందన్నారు. కార్యక్రమంలో సంతోష్ గౌడ్, రాజు స్వామి, మల్లేష్ యాదవ్, రమణ గుప్తా, గీతాంజలి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్యామా ప్రసాద్ ముఖర్జీ త్యాగం అనంతం పసునూరి బిక్షపతి చారి,తులసి ముకేశ్ ముదిరాజ్



**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి,తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యం లో ఈరోజు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు మరియు రంగారెడ్డి రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఆదేశాల మేరకు లక్ష్యం కోసం లక్ష చెట్లు కార్యక్రమం లో భాగంగా నంది హిల్స్,జిల్లెలగుడా లో నిర్వహించినటువంటి దేశీయ చెట్ల మొక్కలను నాటే కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు, మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు ,మహిళా మోర్చా నాయకురాలు,వివిధ మోర్చాల నాయకులు,శక్తి కేంద్ర ఇన్చార్జులు,బూత్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం పెరుగుతుంది

### ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్, మహా:** క్రీడల ద్వార శారీరక, మానసిక ద్రుడత్వం పెరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని మైదానంలో నిర్వహించారు. శిక్షణ కలెక్టర్ సాలోని చబ్రా తో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా క్రీడా జ్యోతిని వెలిగించిన అనంతరం రన్ ను ప్రారంభించారు. క్రీడా జ్యోతిని చేత పట్టుకుని అతిథులు రన్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతకుముందు పలువురు క్రీడాకారులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులను సరైన దిశలో ప్రోత్సహిస్తే ఉత్తమంగా రాణిస్తారని తెలిపారు.కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీ వై ఎస్ఓ జక్కుల శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం

### ఫోన్ ట్యాపింగ్ కేసును రాష్ట్ర ప్రభుత్వం సిబిఐకీ అప్పజెప్పాలి: ఎంపీ డీకే అరుణమ్మ



ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐ కీ అప్పజెప్పాలి

**షాద్ నగర్, మహా:** డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఫరూఖ్ నగర్ మండలం కమ్మదనం గ్రామంలో పోలింగ్ బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈయొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథి గా మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ గారు, జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ హాజరయ్యారు. కమ్మధనం గ్రామం ముఖ్య కూడలి లో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి అరుణమ్మ గారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అమ్మకు వందనం కార్యక్రమంలో భాగంగా కమ్మదనం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎంపీ అరుణమ్మ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అమ్మకు వందనం కార్యక్రమం లో భాగంగా కమ్మధనం గ్రామంలో 2 వేల మొక్కలు నాటడం చాలా అభినందించవలసిన విషయం ముఖ్యంగా సీనియర్ నాయకులు సన్ గోముల శ్యామ్ సుందర్ రెడ్డి గారికి గ్రామ బిజెపి నాయకులకు ప్రత్యేక ధన్యవాదములు తెలపడం జరిగింది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ గారి పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పోలింగ్ బూత్ లో వంద మొక్కలు నాటడం జరుగుతుంది అని అన్నారు. గ్రామంలోని మహిళలు వారి సమస్యలు ఎంపీ గారితో వివరించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ ని నెరవేర్చాలని అన్నారు.

విలేకరులు అడిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై ఎంపీ గారు మాట్లాడుతూ ఫోన్ ట్యాంపింగ్ వ్యవహారం చాలా నీచమైన చర్య భార్యా భర్తలు మాట్లాడే విషయం కూడా వినడం సిగ్గు మాలిన చర్య కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం అతి త్వరలో ఫోన్ ట్యాపింగ్ కేసును సిబిఐ కీ అప్పచెప్పి దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. అదే విధంగా రాజ్ భూపాల్ గౌడ్ గారు మాట్లాడుతూ..రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా లక్ష మొక్కలు నాటుతున్నామని నాటిన మొక్కలను విధిగా సంరక్షించాల్సిన బాధ్యత కూడా మనదే అని అన్నారు ఈ కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పర్యావరణ పరిరక్షణ ఇంచార్జి పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, బిజెపి సీనియర్ నాయకులు చెంది మహేందర్ రెడ్డి, దేపల్లి అశోక్ గౌడ్,మోహన్ సింగ్, విజయ్ బాస్కర్, ఇస్నాతి శ్రీనివాస్, చేగు సుధాకర్ అప్ప,చెట్ల వెంకటేష్, వంశీకృష్ణ, ప్యాట అశోక్, రంగన్న గౌడ్, లష్కర్ నాయక్, అనిల్ గౌడ్, శ్రీరామ్ రెడ్డి,తదితరులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

## నార్సింగ్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

### 107 గ్రాముల కొకైన్ స్వాధీనం

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ డిసిపి కార్యాలయంలో డిసిపి సిహెచ్ శ్రీనివాస్ సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మీడియాకు డిసిపి శ్రీనివాస్ వివరాలు వెల్లడిస్తు. నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్కపూరి కాలనీలో టీ న్యాబ్, నార్సింగ్ పోలీసులు సంయుక్తంగా పక్క సమాచారంతో దాడులు నిర్వహించగా మణికొండ లోని ఓ లగ్జరీ ఫ్లాట్ ని అద్దగా మార్చుకొని గోవా నుంచి డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్ లో అమ్ముతున్నారు. వారి వద్ద నుంచి 107 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నాము. దీని విలువ సుమా 30 లక్షలు ఉంటుందని అంచనా, ఎస్ టి సి పి, పిల్స్ కోకేన్ స్వాధీనం చేసుకున్నాము, విస్డం ఒనేకా, అనే నైజీరియన్ తో పాటుఇద్దరు లోకల్ పెడ్లర్స్ మణికొండ కి చెందిన గోపిశెట్టి రాజేష్, వెస్ట్ గోదావరికి చెందిన బొమ్మదేవర వీరరాజు ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నకిలీ పాస్ పోర్ట్ తో హైదరాబాద్ వచ్చాడు అప్పటి నుండి హైదరాబాదులో నివాసం ఉంటున్న నైజీరియన్. గోవా నుండి డ్రగ్స్ స్మగ్లింగ్ పాల్పడుతున్నాడు.


**విచారణలో విషయాలు.**

మొయినాబాద్ పరిధి అజీజ్ నగర్ లోని ఫాం హౌజ్ లో మే 29న నిర్వహించిన రేవ్ పార్టీకి డ్రగ్స్ సరఫరా చేసిన ముఠా సభ్యులు. మే 31న మంగళగిరి లో ఫణి రాజ్ అనే వ్యక్తికి 15 గ్రాముల కొకైన్ సరఫరా చేశారు. ఈ ముఠా నుంచి డ్రగ్స్ కొన్నవారిని గుర్తించిన పోలీసులు.

## దేశ సమైక్యత, సమగ్రత కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి శ్యామా ప్రసాద్ ముఖర్జి




**బాలాపూర్ మహా:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి,రామిడి వీర కర్ణ రెడ్డి ఆధ్వర్యం లో ఈరోజు శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు,రంగారెడ్డి రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఆదేశాల మేరకు బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం,అల్మాస్ గూడ,శివాజీ చౌక్ యందు నిర్వహించినటువంటి దేశీయ చెట్ల మొక్కలను నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు హాజరై శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు, మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు,మహిళా మోర్చా నాయకురాలు ,వివిధ మోర్చాల నాయకులు,శక్తి కేంద్ర ఇన్చార్జులు, బూత్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.




# జనావాసల మధ్యలో వైన్ షాప్

### వేరేచోటకు మార్చాలని హ్యాపీ హోమ్స్ కాలనీవాసులు ఆందోళన

**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని ఉప్పర్ పల్లి పిల్లర్ నంబర్ 185 వద్ద ఉన్న వైన్ షాప్ ని తొలగించాలని హ్యాపీ హోమ్స్ కాలనీవాసులు సోమవారం ఆందోళన నిర్వహించారు. మద్యం దుకాణం ఉండడం వల్ల హ్యాపీ హోమ్స్ కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం ఆరు అయిందంటే పబ్లిక్ గా మద్యం సేవించడం, మహిళలతో అసభ్యకర ప్రవర్తనలతో వెకిలి చేష్టలతో స్వీటీలు చప్పట్లు కొడుతూ మద్యం సేవిస్తున్నారు. రోడ్డు పక్కన మూత్ర విసర్జన చేస్తున్నారు. మద్యం దుకాణం వల్ల హ్యాపీ హోమ్స్ కాలనీవాసులు చెప్పుకోలేని అవస్థలు పడుతున్నామన్నారు. రోడ్డు ఫుట్ పాత్ పై టూ వీలర్ కార్లు లను అక్రమ పార్కింగ్ పెట్టి రోడ్డుపై అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్, స్కూల్ బస్సు లను రాకుండా ఇబ్బంది పెట్టడం జరుగుతుందనీ కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. తక్షణమే ఎక్సైజ్ డిపార్ట్మెంట్, ట్రాఫిక్ పోలీసులు మద్యం దుకాణాన్ని వేరే చోటుకు మార్చాలని హ్యాపీ హోమ్స్ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# బ్యాంకులకు ఈ వారం వరుస సెలవులు

జూన్ నెల ముగింపునకు వచ్చేసింది. చివరి వారంలో అడుగు పెట్టేశాం. అయితే బ్యాంకులకు వరుస సెలవులు ఉన్నాయి. జూన్ 23 నుంచి 29 వరకు బ్యాంకులకు పలు సెలవులు రానున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో, జాతీయ సంఘటనలు, మతపరమైన పండుగలు, ప్రాంతీయ ఆచారాలు, పరిపాలనా పరిగణనల ఆధారంగా ఈ సెలవులను నిర్ణయిస్తుంది. ఈ వారంలో బ్యాంకులకు ప్రాంతీయ సెలవులు, వారాంతపు సెలవులతో సహా 3 సెలవులు ఉన్నాయి. జూన్ 27న ఒడిశాలో రథయాత్ర / కాంగ్ జరుగుతుంది. ఈ పండుగను పురస్కరించుకుని ఆ రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంకులు మూసివేస్తున్నారు. దీంతోపాటు జూన్ 28న నాల్గవ శనివారం, జూన్ 29న ఆదివారం కావడంతో ఎలాగూ దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులకు సెలవులు ఉంటాయి. దీంతో ఒడిశాలోని కస్టమర్లకు వరుసగా మూడు రోజులపాటు ప్రత్యక్షంగా బ్యాంకు శాఖల సేవలు అందుబాటులో ఉండవు.

**ఈ వారం బ్యాంకు సెలవులు ఇవే..**

- **జూన్ 27 శుక్రవారం:** రథయాత్ర / కాంగ్ (రథ జాత్ర) ఒడిశా, మణిపూర్ లలో బ్యాంకులకు సెలవు
- **జూన్ 28 శనివారం:** నాలుగో శనివారం దేశం అంతటా బ్యాంకులకు సెలవు
- **జూన్ 29 ఆదివారం:** వీక్లీ ఆఫ్ దేశవ్యాప్తంగా బ్యాంకుల మూసివేత.
- **జూన్ 30 సోమవారం:** రెమ్నా ని మిజోరంలో బ్యాంకులకు సెలవు

బ్యాంకులకు వరుస సెలవుల నేపథ్యంలో ప్రత్యక్షంగా బ్యాంకు శాఖలలో పనులు ఉన్నవారు తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ తేదీల్లో భౌతిక శాఖలు మూసివేసినప్పటికీ, చాలా బ్యాంకింగ్ సేవలు డిజిటల్ మార్గాల ద్వారా నిరాటంకంగా కొనసాగుతాయి. నగదు ఉపసంహరణ కోసం వినియోగదారులు ఆన్‌లైన్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్స్, మొబైల్ యాప్‌లు, యూపీఐ సేవలు, ఏటీఎంలను ఉపయోగించుకోవచ్చు. అయితే నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ పరిధిలోకి వచ్చే చెక్కులు, డిమాండ్ డ్రాఫ్ట్‌లు, ఇతర సాధనాలకు సంబంధించిన లావాదేవీలు మాత్రం ఈ అధికారిక సెలవు దినాల్లో జరగవు.






# జియో కొత్త వైఫై.. ఏకంగా 6 రెట్లు అధికంగా..

రిలయన్స్ జియో ఏఎక్స్6000 యూనివర్సల్ రూటర్‌ను భారత్‌లో లాంచ్ చేసింది. ఈ కొత్త వైఫై 6 రౌటర్ మెష్ టెక్నాలజీతో వస్తుంది. జియో ఫైబర్ బ్రాడ్ బ్యాండ్ సర్వీస్ ద్వారా అందిస్తున్న గరిష్ట ఇంటర్నెట్ వేగం 1000 ఎంబీపీఎస్ కాగా ఇది 6,000 ఎంబీపీఎస్ వరకు వేగంతో ఇంటర్నెట్‌ను అందిస్తుంది. అంటే 6 రెట్లు అధిక వేగంతో ఇంటర్నెట్‌ను ఆనందివచ్చు. సుమారు 2,000 చదరపు అడుగుల ప్రాంతాన్ని కవర్ చేస్తుంది. 4కే స్ట్రీమింగ్, గేమింగ్‌కు బాగా సరిపోతుంది.

జియో కొత్త వైఫై రౌటర్ జీరో లాగ్ తో 100కు పైగా డివైజ్ లను హ్యాండిల్ చేస్తుందని, డేటా భద్రత కోసం డబ్ల్యూపీఏ3 సపోర్ట్ తో వస్తుందని చెబుతున్నారు. పెద్ద లేదా బహుళ అంతస్తుల ఇళ్లలో మరింత వేగవంతమైన ఇంటర్నెట్ కోసం ఈ రౌటర్‌ను రూపొందించారు. ఇది ఆన్‌లైన్ గేమర్లు, బింజ్ వాచర్స్, ఎక్కువ కనెక్టెడ్ పరికరాలను వినియోగించే స్మార్ట్ హోమ్ వినియోగదారులు, పెద్ద కుటుంబాలకు అనువైనది.


కొత్త జియో ఏఎక్స్ 6000 యూనివర్సల్ రూటర్ ధర భారత్‌లో రూ.5,999. ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, స్మార్ట్ గ్యాడ్జెట్లు వంటి బహుళ పరికరాలను ఒకేసారి హైస్పీడ్ ఇంటర్నెట్‌కు కనెక్ట్ చేసుకోవచ్చు. డ్యూయల్ బ్యాండ్ వైఫై, జియో ట్రూ ఏఐ మెష్ కవరేజ్, స్మార్ట్ హోమ్ కనెక్టివిటీ వంటి ఇతర ఫీచర్లను కూడా సపోర్ట్ చేస్తుంది. ఈ రౌటర్ ఐపీ ఓవర్ డీహెచ్‌సీపీ కనెక్టివిటీని మాత్రమే సపోర్ట్ చేస్తుందని, ఐపీపీఓఈ, పీపీఓఈ కనెక్షన్ సెటప్ తో పనిచేయదని రిలయన్స్ తెలిపింది. కంపెనీ వెబ్‌సైట్‌తోపాటు ఇతర ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ఈ రౌటర్‌ను కొనుగోలు చేయవచ్చు.

## 8.49 లక్షల మందికి కొత్తగా ఈపీఎఫ్




ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ పరిధిలోకి ఏప్రిల్ నెలలో 19.14 లక్షల మంది చేరారు. ఈ ఏడాది మార్చి నెలలో చేరికతో పోల్చితే 31 శాతం, 2024 ఏప్రిల్ నెల గణాంకాలతో పోల్చి చూస్తే 1 శాతం వృద్ధి నమోదైంది. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసింది. ఏప్రిల్‌లో కొత్త సభ్యుల చేరిక 8.49 లక్షలుగా ఉంది. మార్చి నెలలో కొత్త సభ్యుల చేరిక కంటే 12.49 శాతం ఎక్కువ. అంటే వీరు మొదటి సారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్టు తెలుస్తోంది. ఇందులో మహిళా సభ్యులు 2.45 లక్షల మంది ఉన్నారు. మార్చి నెలతో పోల్చి చూస్తే 17.63 శాతం పెరిగారు. కొత్త సభ్యుల్లో 57 శాతం మేర అంటే, 4.89 లక్షల మంది వయసు 18-25 ఏళ్ల మధ్య ఉంది. మహిళా సభ్యుల నికర చేరిక మాత్రం మార్చి నెలతో పోల్చి చూస్తే 35 శాతం అధికంగా 3.95 లక్షలుగా ఉంది. ఏప్రిల్‌లో సుమారుగా 15.77 లక్షల మంది సభ్యులు ఒక సంస్థలో ఉద్యోగం మానేసి, మరో సంస్థలో చేరారు. మార్చి నెలతో పోల్చి చూస్తే 19 శాతం పెరిగింది. నికర చేరికలో అత్యధికంగా 21 శాతం సభ్యులు మహారాష్ట్ర నుంచి ఉన్నారు.

## నష్ట సూచీలు.. పడిపోయిన స్టాక్ మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలలో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధంలో అమెరికా ప్రవేశించడం, ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై బాంబు దాడి చేయడం వంటి పరిస్థితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తం కావడంతో బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు ఈ వారం తొలి ట్రేడింగ్ సెషన్ ను నష్టాలతో ముగించాయి. 82,169.67 81,476.76 శ్రేణిలో ట్రేడైన బీఎస్ఈ సెన్సెక్స్ 511.38 పాయింట్లు లేదా 0.62 శాతం క్షీణించి 81,896.79 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 140.50 పాయింట్లు (0.56 శాతం) క్షీణించి 24,971.90 వద్ద స్థిరపడింది. సోమవారం ఈ సూచీ 25,057 24,824.85 శ్రేణిలో ట్రేడ్ అయింది. సెన్సెక్స్ లోని 30 షేర్లలో 21 నష్టాలలో ముగియగా, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, లార్సెన్ అండ్ టూబ్రో, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ షేర్లు 2.28 శాతం నుంచి 1.21 శాతం మధ్య నష్టపోయాయి. ట్రెంట్, భారత్ ఎలక్ట్రానిక్స్, బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్ 3.39 శాతం 0.58 శాతం మధ్య లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.36 శాతం, 0.70 శాతం లాభపడటంతో విస్తృత మార్కెట్లు బెంచ్ మార్క్ లను అధిగమించాయి. సెక్టోరల్ మార్కెట్లు మిశ్రమంగా స్థిరపడ్డాయి, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 1.48 శాతం నష్టపోయింది, కోఫోర్జ్, పెర్సిస్టెంట్ సిస్టమ్స్ నష్టపోయాయి. ఇతర రంగాల సూచీల్లో బ్యాంక్ నిఫ్టీ, ఆటో, ఎఫ్ఎంసీజీ, రియల్టీ సూచీలు నష్టపోగా, మెటల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఫార్మా, మీడియా సూచీలు లాభాల్లో ముగిశాయి. ఎన్ఎస్ఈలో ట్రేడైన 2,995 షేర్లలో 1,545 షేర్లు నష్టాలలో స్థిరపడగా, 1,364 షేర్లు లాభాలను అందుకున్నాయి. 86 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. ఎన్ఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.13 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. మార్కెట్లలో అస్థిరతను అంచనా వేసే ఫియర్ ఇండెక్స్ (ఇండియా వీఐఎక్స్) 2.74 శాతం లాభంతో 14.05 పాయింట్ల వద్ద ముగిసింది.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL




# కుమార్తె 'నీట్' స్కోర్ తగ్గిందని.. విచక్షణ మరచి..



**సాంగ్లీ:** మహారాష్ట్రంలో మరో విద్యాకుసుమం నేలరాలింది. సాంగ్లీ జిల్లాలో జరిగిన ఈ ఉదంతం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. కుమార్తెను డాక్టర్‌గా చూడాలనుకున్న ఒక తండ్రి చేసిన పని అతని కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. కుమార్తె మరణానికి ప్రధానోపాధ్యాయుడైన ఆ తండ్రే కారణమంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)లో మంచి మార్కులు సాధించలేదని తన 17 ఏళ్ల కుమార్తెపై తండ్రి దాడి చేసిన ఉదంతం వెలుగు చూసింది. సాంగ్లీ జిల్లాలోని నెల్కరంజి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతిచెందిన విద్యార్థినిని సాధన భోస్లేగా పోలీసులు గుర్తించారు. ఆమె స్థానికంగా ఉన్న ఒక పాఠశాలలో 12వ తరగతి చదువుతోంది. సాధన తండ్రి ధోండిరామ్ భోస్లే కుమార్తె చదువుతున్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా ఉన్నారు. కుమార్తె నీట్ మాక్ టెస్ట్ లో తక్కువ మార్కులు సాధించడంతో ఆమెను తండ్రి మందలించారు. అయితే సాధన తండ్రితో వాగ్వాదానికి దిగింది. కుమార్తె మాటలు ధోండిరామ్ భోస్లేకు ఆగ్రహం తెప్పించాయి. వెంటనే ఆయన ఒక కర్రతో కుమార్తెపై తీవ్రంగా దాడి చేశాడు. గాయపడిన సాధనను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా, అలానే వదిలివేశాడు. మర్నాడు కూడా కుమార్తెను పట్టించుకోకుండా, యథావిధిగా తన స్కూలుకు వెళ్లిపోయాడు. ధోండిరామ్ భోస్లే పాఠశాల నుంచి తిరిగి వచ్చేసరికి, ఇంటిలో సాధన అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించాడు. అయితే అక్కడ చికిత్స ప్రారంభించేలోపే సాధన మృతిచెందింది. పోలీసులు నిందితుడైన తండ్రిని అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మేఘాలయ హనీమూన్ హత్యకేసులో సిట్ కీలక పురోగతి




**షిల్లాంగ్:** మేఘాలయ హనీమూన్ హత్య కేసులో సిట్ అధికారుల దర్యాప్తులో పురోగతి సాధించారు. పెళ్లైన 11 రోజులకే తన భర్త రాజా రఘు వంశీ హత్య కేసులో సోనమ్ రఘువంశీ పాటు ఇతర నిందితుల సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ సిట్ దర్యాప్తులో సోనమ్‌కు సహకరించిన ఫ్లాటు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలు సోనమ్ రఘువంశీ తన భర్త రాజా రఘువంశీని హత్య చేసిన తర్వాత నిందితులు ఇండోర్‌లో ఓ ఫ్లాటును అద్దెకు తీసుకున్నారు. ఆ ఫ్లాట్ యజమాని ఓ ఇన్‌ఫ్రాస్టక్చర్ కంపెనీ యజమాని లోకేంద్ర తోమర్. అయితే, సోనమ్ ఉండేందుకు అద్దె ఇల్లు చూపించిన ప్రాపర్టీ డీలర్ సలోమ్ జేమ్స్‌ను పోలీసులు ప్రశ్నించడంతో లోకేంద్ర తోమర్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇక పోలీసుల దర్యాప్తులో సోనమ్ అద్దెకు ఉన్న ఇంటి నుంచి కంట్రీ మేడ్ పిస్టల్, ఆమె ఫోన్, రాజా నగలు, ఐదు లక్షల రూపాయల నగదును తీసుకెళ్లాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అంతేకాదు, జేమ్స్ చెప్పిన వివరాల మేరకు.. సోనమ్ పోలీసులకు లొంగిపోయిన కొద్ది సేపటికే తోమర్.. జేమ్స్‌కు ఫోన్ చేశారు. సోనమ్ అద్దెకు ఉన్న ఫ్లాట్‌లో ఓ బ్యాగ్ ఉందని, వెంటనే దాన్ని తీసేయాలని కోరాడు. కానీ జేమ్స్ ఆ బ్యాగ్‌ను తీయించలేదు. అందుకే తమర్ ఆ బ్యాగ్‌ను తీసుకున్నాడు. తన ఫ్లాట్ సమీపంలోని కార్ షోరూమ్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను తొలగించేందుకు ప్రయత్నించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. తోమర్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉంది. ఇండోర్‌లో అతని ఆచూకీ కోసం పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారని వర్గాలు తెలిపాయి.

## ఎన్నికల కౌంటింగ్ కేంద్రంలో పేలిన బాంబు.. నాలుగో తరగతి విద్యార్థిని మృతి



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఉప ఎన్నికల కౌంటింగ్ ఉద్రిక్తతకు దారితీశాయి. సోమవారం కాళీగంజ్ నియోజక వర్గంలోని కౌంటింగ్‌లో నాటు బాంబు పేలి 10ఏళ్ల బాలిక మృతి చెందింది. తూర్పు నదియా జిల్లా బరోచాంద్ నగర్ గ్రామంలో ఎన్నికల కౌంటింగ్ జరిగింది. ఘటన జరిగే సమయానికి ఈ కేంద్రంలో అధికార తృణమూల్ కాంగ్రెస్ లీడింగ్‌లో ఉంది. ఆ సమయంలో కౌంటింగ్ కేంద్రంలో నాటు బాంబు పేలి నాలుగో తరగతి చదువుతున్న 10 ఏళ్ల బాలిక తమన్నా ఖాటూన్ తీవ్రంగా గాయపడింది. ఊహించని పరిణామంతో అప్రమత్తమైన స్థానికులు చిన్నారిని అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆ చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే, ఈ దుర్ఘటనపై సమాచారం అందుకున్న సీఎం మమతా బెనర్జీ విచారం వ్యక్తం చేశారు. చిన్నారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దుర్ఘటనకు కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేశారు.

## రెండేళ్లుగా పహల్గామ్ ముష్కరులు యాక్టివ్?



**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల జరిగిన ఉగ్రదాడిపై దర్యాప్తు సంస్థలు తమ విచారణను కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ముష్కరులకు సంబంధించిన పలు విషయాలు వెలుగు చూస్తున్నాయి. జమ్మూ ప్రాంతంలో రెండేళ్లుగా యాక్టివ్‌గా ఉన్న ఈ ముష్కరులు.. భారత భద్రతా దళాలపై జరిగిన మూడు ప్రధాన దాడులలో పాల్గొన్నారనే అనుమానాలున్నాయి. పహల్గామ్ దాడి వెనుక ఉన్న ఉగ్రవాదుల జాడను భద్రతా సంస్థలు సేకరించాయి. ఈ ఉగ్రవాదులు పూంచ్‌లోని డెహ్రా కి గలి (డీకేజీ) ద్వారా భారత్‌లోనికి చొరబడి 2022 చివర లేదా 2023 ప్రారంభం నుండి జమ్ముకశ్మీర్ అంతటా తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడయ్యింది. జమ్ము ప్రాంతంలో ఒక సంవత్సరానికి పైగా చురుకుగా ఉన్న ఈ బృందం 2024 ద్వితీయార్థంలో భారత భద్రతా దళాలపై దాడులకు తెగబడిందని తెలుస్తోంది. ఈ ముష్కరుల బృందం తొలిసారిగా 2023 డిసెంబర్ 21న పూంచ్‌లోని సురాన్‌కోట్‌లోని బుఫ్లియాజ్ ప్రాంతంలో జరిగిన దాడిలో పాల్గొంది. నాటి దాడిలో నలుగురు భారత ఆర్మీ సైనికులు మరణించారు. 2024 మేలో బక్రాబల్ మొహల్లా వద్ద భారత వైమానిక దళ కాన్వాయ్‌పై జరిగిన మెరుపుదాడిలోనూ వీరి ప్రమేయం ఉందని నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. పూంచ్‌లోని దట్టమైన అడవులు, పర్వత ప్రాంతాలలో నెలల తరబడి కార్యకలాపాలు సాగించిన ఈ బృందం 2024లో కశ్మీర్‌కు తన స్థావరాన్ని మార్చుకున్నట్లు తెలుస్తోంది. పహల్గామ్ దాడికి ముందు వీరు సమావేశమయ్యారని దర్యాప్తులో వెల్లడయ్యింది.

## కులం పేరుతో దూషిస్తూ.. ఇండిగో సిబ్బందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

**న్యూఢిల్లీ:** ఇండిగో ఎయిర్‌లైన్స్ ట్రైనీ పైలట్ ఒకరు.. సంచలన ఆరోపణలకు దిగారు. తనను కులం పేరుతో అతిదారుణంగా దూషించారంటూ సహచరులపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురుగ్రామ్‌లోని ఎయిర్‌లైన్స్ హెడ్‌క్వార్టర్స్ ఈ ఘటన జరగ్గా.. పోలీసులు ఈ వ్యవహారంపై దర్యాప్తు ముమ్మరం చేశారు. బెంగళూరుకు చెందిన శరణ్ కుమార్ (35) అనే ఇండిగో ట్రైనీ పైలట్.. ఎమ్మార్ క్యాపిటల్ టవర్ 2లో జరిగిన మీటింగ్‌కు హాజరయ్యారు. ఆ టైంలో మరో ముగ్గురు ఉద్యోగులు అతన్ని ఉద్దేశించి దారుణమైన వ్యాఖ్యలు చేశారు. శరణ్ తండ్రి అశోక్ కుమార్ చేసిన ఫిర్యాదులో.. "కాక్ పిట్‌లో కూర్చుని విమానం నడిపేందుకు నీకు (శరణ్‌ను ఉద్దేశించి..) అర్హత లేదు. ఇండిగోలో గుమాస్తాగా కాదు కదా.. కనీసం మా బూట్లు నాకడానికి కూడా నువ్వు పనికిరావు. పోయి.. మీ తాతముత్తాతల్లాగా చెప్పులు కుట్టుకుని పని చేసుకుంటూ బతుకు" అంటూ తనపై వ్యాఖ్యలు చేశారని తపస్ డే, మనిష్ సహానీ, రాహుల్ పాటిల్‌పై శరణ్ ఫిర్యాదు చేశారు. అంతేకాదు.. తన కుమారుడి విషయంలో ఎయిర్‌లైన్స్ వాళ్లు దారుణంగా వ్యవహరించారని.. ఈ విషయాన్ని ఇండిగో ఎయిర్‌లైన్స్ ఎథిక్స్ కమిటీ, ఆఖరికి ఆ సంస్థ సీఈవో దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు లేవని అశోక్ మీడియా ముందు వాపోయారు. అంతేకాదు.. తన కొడుకు విధినిర్వహణలో సక్రమంగా ఉన్నప్పటికీ సెలవులు ఇవ్వకుండా, పైగా జీతాల్లో కోతలు పెట్టారని ఆరోపించారాయన. ఘటనపై బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్లతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు బెంగళూరు పోలీసులు. అయితే ఈ ఘటన జరిగింది గురుగ్రామ్ (హర్యానా)లోని కార్పొరేట్ ఆఫీస్ పరిధిలో. దీంతో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన బెంగళూరు పోలీసులు.. గురుగ్రామ్‌లోని డీఎల్ఎఫ్ 1 పీఎస్‌కు కేసును బదిలీ చేశారు.



## నాగార్జున ఎవరి కాళ్లకు దండం పెట్టడు..
# ఒక్క ఆయనకు మాత్రమే: చిరంజీవి



శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో వచ్చిన తాజా చిత్రం కుబేర. ఈ మూవీకి విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్ వస్తోంది. ధనుశ్ కీలక పాత్ర పోషించిన ఈ సినిమాలో టాలీవుడ్ కింగ్ నాగార్జున కూడా నటించారు. ఈ సినిమా సక్సెస్ కావడంతో మేకర్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. తాజాగా హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగార్జున గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. నాగార్జున ఎవరి కాళ్లకు దండ పెట్టడు.. ఒక్క ఆయనకు తప్పా.. అని అన్నారు.

మెగాస్టార్ మాట్లాడుతూ..'నాగార్జున ఎవరి కాళ్లకు దండం పెట్టడు.. ఒక్క ఆయన మీ నాన్నగారి( సునీల్ నారంగ్ తండ్రి నారాయణ్‌దాస్ నారంగ్) కాళ్లకు తప్పా. నాకు ఆయన అంతే ఇష్టం. ఆయన గౌరవాన్ని నిలబెడుతూ మీరిద్దరు కూడా వెళ్లడం చాలా గర్వంగా ఉంది. అంతేకాకుండా థర్డ్ జనరేషన్ జాన్వీ కూడా అదే బాటలో వెళ్తోంది. మళ్లీ మాతో సినిమా చేయొచ్చు కదా అని సునీల్ నారంగ్ నాతో అన్నారు. మా నాన్నగారు మీ సినిమాలు చేసి బాగా డబ్బులు సంపాదించాం. కానీ ఆ తర్వాత అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ పెట్టిన తర్వాత మీకు సినిమాలు రాకుండా పోయాయి కదా (నవ్వుతూ). ఇక మీ మూడో తరం నిర్మాత జాన్వీకి ఆల్ ది బెస్ట్. ఇక జాన్వీతో కూడా సినిమా చేస్తే మూడు జనరేషన్స్‌తో చేసినట్లవుతుందని' చిరంజీవి అన్నారు.

## డ్యూడ్‌లో కురళ్‌గా

లవ్‌టుడే, డ్రాగన్ చిత్రాల ఫేం ప్రదీప్ రంగనాథన్ కథానాయకుడిగా రూపొందుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'డ్యూడ్'. 'ప్రేమలు'ఫేం మమిత బైజూ కథానాయిక. కీర్తిశ్వరన్ దర్శకుడు. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఆదివారం కథానాయిక మమితా బైజు పుట్టినరోజు సందర్భంగా, ఆమెకు శుభాకాంక్షలు అందిస్తూ.. ఇందులో ఆమె పోషిస్తున్న 'కురళ్' పాత్రను పరిచయం చేస్తూ ఓ స్పెషల్ పోస్టర్‌ని ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. బ్యూటీ అండ్ చార్మ్‌తో యువతను ఆకట్టుకునేలా ఈ పోస్టర్‌లో మమిత బైజు కనిపిస్తున్నారు. శరత్‌కుమార్, హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నికేత్ బొమ్మి, సంగీతం: సాయి అభ్యంకర్.



## బాక్సాఫీస్ వద్ద కుబేర.. వీకెండ్‌లో ఎన్ని కోట్లు వచ్చాయంటే?

ధనుశ్, నాగార్జున కీలక పాత్రల్లో వచ్చిన తాజా చిత్రం కుబేర. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమా.. బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. తొలిరోజే పాజిటివ్ టాక్ రావడంతో వసూళ్లపరంగా రాణిస్తోంది. ఈ మూవీకి ప్రపంచవ్యాప్తందా మూడు రోజుల్లోనే రూ.87 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ వసూళ్లతో ఈ వీకెండ్‌లో ప్రపంచవ్యాప్తంగా ఏకంగా తొమ్మిదో స్థానంలో నిలిచింది. హాలీవుడ్ హీరో డకోటా జాన్సన్ నటించిన మెటీరియలిస్ట్స్ మూవీని అధిగమించింది.

ఇండియా వ్యాప్తంగా చూస్తే మూడు రోజుల్లో కుబేర మూవీ రూ.48.60 కోట్ల నికర వసూళ్లను సాధించింది. దేశవ్యాప్తంగా రూ. 57 గ్రాస్ కోట్ల వసూళ్లు రాబట్టింది. ఓవర్‌సీస్‌లో రూ.23 కోట్లకు పైగా వసూళ్లు రాగా.. ఓవరాల్‌గా రూ.80 కోట్లకు పైగా కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే నాగ చైతన్య చిత్రం తండేల్ రూ.88.25 కోట్ల వసూళ్లను అధిగమించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ చిత్రంలో రష్మిక మందన్న హీరోయిన్‌గా నటించింది. బాలీవుడ్ నటుడు జిమ్ సర్భ్ ప్రధాన పాత్ర పోషించారు. మరోవైపు అదే రోజు విడుదలైన ఆమిర్ ఖాన్ నటించిన సితారే జమీన్ పర్ సినిమా రూ.88 కోట్ల కలెక్షన్స్ సాధించింది. ప్రపంచవ్యాప్తంగా విడుదలైన సినిమాలపరంగా చూస్తే హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్, 28 ఇయర్స్ లేటర్, ఎలియో వంటి చిత్రాలు ఈ జాబితాలో ముందంజలో ఉన్నాయి. బాలేరినా మూవీ సితారే జమీన్ పర్‌కు కాస్తా దగ్గరగా ఉంది.



## క్రీడా వార్తలు | SPORTS NEWS

# టీమిండియాకు షాక్



భారత్‌ఇంగ్లండ్ మధ్య లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతుంది. తొలి ఇన్నింగ్స్‌ల్లో ఇరు జట్లు నువ్వా నేనా అన్నట్లు బ్యాటింగ్ చేశాయి. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (101), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (147), వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ (134) సెంచరీలతో చెలరేగడంతో 471 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్‌టంగ్, కెప్టెన్ బెన్ స్టోక్స్ తలో నాలుగు వికెట్లు తీయగా.. షోయబ్ బషీర్, బ్రైడన్ కార్స్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ టీమిండియాకు ధీటుగా బదులిచ్చింది. ఓపెనర్ బెన్ డకెట్ (62) అర్ధ శతకంతో రాణించగా.. ఓలీ పోప్ (106) శతక్కొట్టాడు. హ్యారీ బ్రూక్ 99 పరుగులతో తృటిలో సెంచరీ మిస్ అయ్యాడు. మిగతా ఆటగాళ్లలో జేమీ స్మిత్ 40, క్రిస్ వోక్స్ 38 పరుగులతో పర్వాలేదనిపించారు. ఫలితంగా ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 465 పరుగులు చేసింది. దీంతో భారత్‌కు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. భారత బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్లతో చెలరేగగా.. ప్రసిద్ కృష్ణ మూడు, సిరాజ్ రెండు వికెట్లు దక్కించుకున్నారు. ఆరు పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 90 పరుగులు చేసింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4), వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (30) ఔట్ కాగా.. మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (47), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 6 పరుగులతో క్రీజులో ఉన్నారు. 6 పరుగుల ఆధిక్యం కలుపుకొని భారత్ 96 పరుగుల ఆధిక్యంలో ఉంది.

**నాలుగో రోజు ఆట ప్రారంభం కాగానే టీమిండియాకు షాక్**

ఓవర్‌నైట్ స్కోర్ 90/2 వద్ద నాలుగో రోజు ఆటను ప్రారంభించిన టీమిండియాకు ఆదిలోనే షాక్ తగిలింది. తొలి ఓవర్ చివరి బంతికే (24.6వ ఓవర్) బ్రైడన్ కార్స్ బౌలింగ్‌లో తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో శుభ్‌మన్ గిల్ (8) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఓవర్‌నైట్ స్కోర్‌కు మరో రెండు పరుగులు మాత్రమే జోడించి భారత్ మూడో వికెట్ కోల్పోయింది. కేఎల్ రాహుల్‌కు జతగా రిషబ్ పంత్ క్రీజ్‌లోకి వచ్చాడు. గిల్ వికెట్ కోల్పోవడంతో కేఎల్ రాహుల్, రిషబ్ పంత్‌పై ఒత్తిడి పడే అవకాశం ఉంది. ఇంగ్లండ్ ముందు టీమిండియా గౌరవప్రదమైన టార్గెట్ ఉంచాలంటే రాహుల్, పంత్ చాలా కీలకం కానున్నారు. వీరిద్దరు ఈ రోజంతా క్రీజ్‌లో ఉంటేనే భారత్ ఓ మోస్తరు స్కోర్ చేయగలుగుతుంది.

## నమ్మశక్యంకాని రీతిలో మ్యాచ్‌ను
# గెలిపించిన వరుణ్ చక్రవర్తి..





తమిళనాడు ప్రీమియర్ లీగ్‌లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బ్యాటర్‌గా చెలరేగిపోయాడు. లక్ష్య ఛేదనలో చివరి 2 బంతుల్లో 7 పరుగులు అవసరమైనప్పుడు.. వరుసగా సిక్సర్, బౌండరీ కొట్టి తన జట్టును గెలిపించాడు. వరుణ్ మ్యాచ్‌ను గెలిపించాక, అతని జట్టు కెప్టెన్, టీమిండియా దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్రమైన భావోద్వేగానికి లోనయ్యాడు. కాసేపు తల వంచుకొని అలాగే ఉండిపోయాడు. అనంతరం వరుణ్‌ను అభినందించేందుకు గ్రౌండ్‌లోకి వచ్చాడు. ఈ మొత్తం తంతుకు సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరలవుతుంది.

**పూర్తి వివరాల్లోకి వెళితే..**

తమిళనాడు ప్రీమియర్ లీగ్ 2025లో భాగంగా దిండిగుల్ డ్రాగన్స్, సేలమ్ స్పార్టన్స్ జట్లు నిన్న (జూన్ 22) తలపడ్డాయి. ఈ లీగ్‌లో రవిచంద్రన్ అశ్విన్ దిండిగుల్ డ్రాగన్స్‌కు సారథ్యం వహిస్తుండగా.. వరుణ్ చక్రవర్తి ఆ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన స్పార్టన్స్.. నిధీశ్ రాజగోపాల్ (47 బంతుల్లో 74) చెలరేగడంతో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేసింది. స్పార్టన్స్ ఇన్నింగ్స్‌లో రాజేంద్రన్ (35), సన్నీ సంధు (25) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. స్పార్టన్స్‌ను అశ్విన్ అద్భుతమైన బౌలింగ్‌తో దెబ్బకొట్టాడు. అశ్విన్ తన కోటా 4 ఓవర్లలో 3 వికెట్లు తీసి కేవలం 22 పరుగులు మాత్రమే ఇచ్చాడు. సందీప్ వారియర్, కార్తీక్ శరణ్, వరుణ్ చక్రవర్తి తలో వికెట్ తీశారు. అనంతరం లక్ష్య ఛేదనలో డ్రాగన్స్‌ను అశ్విన్ మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. ఈ లీగ్‌లో ఆది నుంచి ఓపెనర్‌గా బరిలోకి దిగుతున్న అశ్విన్ నిన్నటి మ్యాచ్‌లో 14 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 36 పరుగులు చేశాడు. అశ్విన్ ఔటయ్యాక కాస్త తడబడిన డ్రాగన్స్‌ను శివమ్ సింగ్ (34), జయంత్ (25), హన్నీ సైనీ (35), విమల్ కుమార్ (24) ఓ మోస్తరు ఇన్నింగ్స్‌లతో ఆదుకున్నారు. వికెట్లు పడుతున్నా వీరు డ్రాగన్స్‌ను గెలుపు ట్రాక్‌లోనే ఉంచారు. తొమ్మిదో స్థానంలో వరుణ్ చక్రవర్తి బ్యాటింగ్‌కు దిగే సమయానికి డ్రాగన్స్ గెలుపుకు 11 బంతుల్లో 20 పరుగులు అవసరంగా ఉన్నాయి. ఈ దశలో బ్యాట్‌కు పని చెప్పిన వరుణ్, నమ్మశ్యంకాని రీతిలో 5 బంతుల్లో 13 పరుగులు చేసి తన జట్టును గెలిపించాడు. చివరి 2 బంతుల్లో 7 పరుగులు అవసరమైన తరుణంలో వరుణ్ వరుసగా సిక్సర్, బౌండరీ కొట్టి గెలిపించిన వైనం మ్యాచ్ మొత్తానికే హైలైట్‌గా నిలిచింది. తొలుత బంతితో, ఆ తర్వాత బ్యాట్‌తో ఇరగదీసిన అశ్విన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

## 'లక్ష్మణ్‌ను కాదని అతడిని తీసుకున్నాం.. నాతో మూడు నెలలు మాట్లాడలేదు'

టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ 2003 వన్డే ప్రపంచకప్ నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నాడు. జట్టు ఎంపిక సమయంలో ఆచితూచి వ్యవహరించామని.. కూర్పు దృష్ట్యా నాడు ఓ దిగ్గజ బ్యాటర్‌కు మొండిచేయి చూపామని పేర్కొన్నాడు. ఈ కారణంగా అతడు తనతో మూడు నెలల పాటు ఒక్క మాట కూడా మాట్లాడలేదని తాజాగా వెల్లడించాడు. కాగా 2003లో సౌతాఫ్రికాలో జరిగిన వన్డే వరల్డ్‌కప్ జట్టులో యాజమాన్యం వీవీఎస్ లక్ష్మణ్‌కు చోటు ఇవ్వలేదు. అతడిని కాదని దినేశ్ మోంగియాను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఇక నాటి ఈ ఐసీసీ టోర్నీలో టీమిండియా రన్నరప్‌తో సరిపెట్టుకుంది.

**నాతో మూడు నెలలు మాట్లాడలేదు**

తాజాగా నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్న వరల్డ్‌కప్ జట్టు కెప్టెన్ సౌరవ్ గంగూలీ.. లక్ష్మణ్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. టైమ్స్ ఆఫ్ ఇండియాతో మాట్లాడుతూ.. ''ఆటగాళ్లకు విశ్రాంతినివ్వడం సహజమే. అలా చాలా మందిని చాలా సార్లు పక్కనపెట్టాల్సి వచ్చేది. అందుకు వారు అసంతృప్తికి లోనవడం కూడా మామూలే. వరల్డ్‌కప్ జట్టులో స్థానం దక్కనందుకు లక్ష్మణ్ నాతో మూడు నెలల పాటు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. నేను చొరవ తీసుకుని అతడిని కదిలించాను. ఏ ఆటగాడి కెరీర్‌లోనైనా ఇలాంటి ఆటుపోట్లు తప్పవు. ముఖ్యంగా సమర్థవంతుడైన తనకు చోటు దక్కనందుకు లక్ష్మణ్ అసంతృప్తికి లోనుకావడం, బాధపడటం సహజమే.

**పాక్‌లో అదరగొట్టాడు**

అయితే, ప్రపంచకప్ టోర్నీలో మా ప్రదర్శన పట్ల అతడు సంతోషం వ్యక్తం చేశాడు. ఈ ఈవెంట్ తర్వాత అతడు వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. పాకిస్తాన్, ఆస్ట్రేలియా పర్యటనల్లో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఏ ఆటగాడైనా జట్టులో చోటు దక్కనపుడు బాధపడినా... దానిని మరీ వ్యక్తిగతంగా తీసుకోరు. జట్టు ప్రయోజనాల కోసం తమ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు'' అని గంగూలీ పేర్కొన్నాడు. కాగా టీమిండియా తరఫున గంగూలీ 1992 నుంచి 2008 వరకు 113 టెస్టులు, 311 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. ఆయా ఫార్మాట్లలో వరుసగా 7212, 11363 పరుగులు సాధించాడు. భారత క్రికెట్ జట్టు దశ దిశ మార్చిన కెప్టెన్‌గా పేరొందిన దాదా ఖాతాలో.. 16 టెస్టు, 22 వన్డే శతకాలు ఉన్నాయి. మరోవైపు.. హైదరాబాదీ వీవీఎస్ లక్ష్మణ్ 1996 2012 మధ్య భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. తన కెరీర్‌లో 134 టెస్టుల్లో 8781 పరుగులు,86 వన్డేల్లో 2338 పరుగులు సాధించాడు. ఇక గతంలో గంగూలీ భారత క్రికెట్ నియంత్రణ మండలి అధ్యక్షుడిగా పనిచేయగా.. లక్ష్మణ్ జాతీయ క్రికెట్ అకాడమీ చీఫ్‌గా ఉన్నాడు. ప్రధాన కోచ్‌ల గైర్హాజరీలో టీమిండియా హెడ్‌కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్ మహా;** జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డియార్వో విజయలక్ష్మి , జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి,ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి,నర్సంపేట ఉమారాణి పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిష్కరించాలని, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 121 దరఖాస్తులు రాగా ఎక్కువగా రెవెన్యూ 53, హౌసింగ్ 14 దరఖాస్తులు వచ్చాయని మిగతా శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 54 వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, పరిష్కరించుటకు వీలుకాని సమస్యలను ఎందుకు పరిష్కరించబడవో దరఖాస్తు దారునికి వివరించాలని, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కరించిన వివరాలు దరఖాస్తుదారుడి మొబైల్ కి సాంకేతిక సమాచారం ద్వారా అందించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టిఐ పెండెల్సి లేకుండా చూడాలని, గ్రీవెన్స్ పోర్టల్ లో పెండెల్సి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, e ఫైలింగ్ విధానాన్ని అమలుచేయాలని, ,బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పని సరి అని అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. వ్యవసాయ, ఆరోగ్య, విద్యా శాఖ తదితర శాఖలు శాఖపరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నిర్ధిత గడువు లోగాపనులు చేయించాలని పనులపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేసి లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విద్యా శాఖ విషయంలో టాయిలెట్లు, వాష్ రూమ్ లో ఏవైతే మరమత్తులు చేయవలసి ఉన్నట్లైతే ఆయా స్కూళ్లను పరిశీలించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పనులు పూర్తి చేయాలని, జిల్లాలో ఉన్న హాస్టల్స్ ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న నీటి ట్యాంక్ లను క్లీనింగ్ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ని, ఆర్ సి ఓ లను ఆదేశించారు.

## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

- సత్వరమే ఫిర్యాదుల పరిష్కారం
- సంబంధిత అధికారులకు ఆదేశాలు
- జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి
- ప్రజావాణికి 76 ఫిర్యాదులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (76) ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ శాఖ - 31, ఇతర శాఖలకు - 45, మొత్తం 76 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ... వన మహోత్సవంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయుటకు సంబంధిత శాఖల అధికారులు మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలని, అవసరమైన మొక్కలను నర్సరీలలో అందుబాటులో ఉంచాలని, నాటిని ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. వర్షా కాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యాధి కారికి సూచించారు. జిల్లాలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా చూడాలని వ్యవసాయ శాఖాధి కారికి తెలిపారు.



## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి**

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గం 22 వ డివిజన్ లోని మర్రి వెంకటయ్య కాలనీలో వరంగల్ మహా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి కాలనీలో పర్యటించి తడి చెత్త పొడి చెత్త వేరు చేసి చెత్త ట్రాక్టర్లలో వేయాలని అలాగే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అంతేకాకుండా కాలనీ వాసుల కోతుల బెడదలతో ఇబ్బంది పడుతున్నామని వారి అభ్యర్థన మేరకు కోతుల బోన్ పెట్టించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ గోపాల్ మధుకర్, మలేరియా సిబ్బంది తో పాటు మున్సిపాల్ సానిటరీ సూపర్వైజర్ భాస్కర్, జవాన్ శివ, సంజయ్, తదితరులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## రైతులకు ఉచితంగా కంది విత్తనాల పంపిణీ

- ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి
- పంట మార్పిడితో లాభదాయకమైన పంటలు వేసుకోవాలి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రైతులకు కంది విత్తనాలు ఉచితంగా పంపిణీ చేసిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య. సోమవారం నవాబ్ పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని, జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద రైతులకు కంది విత్తనాలను చేవెళ్ల స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కంది సాగు ప్రోత్సహించేందకు రైతులకు ఉచితంగా కంది విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు తమ పోలాలలో పంట మార్పిడితో, లాభదాయకమైన వివిధ రకాల పంటలను వేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బల్దియా ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు

- ఫిర్యాదుల పరిష్కారం పై శ్రద్ధ వహించండి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ మహా;** ప్రజా ఫిర్యాదుల పరిష్కారం పై అధికారులు శ్రద్ధ వహించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ హితవు పలికారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుండి దరఖాస్తు లను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన వినతులను , క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా విభాగాల అధికారులు పెండింగ్లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని, దరఖాస్తులు రిపీట్ కాకూడదని అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో కొనసాగుతున్న చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతతో జరిగేలా ఇంజనీరింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం నిబంధనల మేరకు అంతర్గత రోడ్లు నిర్మించాలని, రోడ్డు నిర్మాణానికి ముందు తప్పకుండా మురుగు కాలువలు నిర్మించాలని సూచించారు. బల్దియా ఆధ్వర్యంలో నిర్వహించబడే ఉద్యానవనాల్లో పచ్చదనం, లైటింగ్, ఆట వస్తువుల నిర్వహణ సక్రమంగా జరగాలని, అవసరం మేరకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా

**1.ఇంజనీరింగ్....41**
**2.హెల్త్ & సానిటేషన్.....12**
**3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)..09**
**4.టౌన్ ప్లానింగ్...68**
**5.మంచినీటి సరఫరా.......03**

మొత్తం = 133 గా అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, ఇన్చార్జి ఎస్ ఈ మహేందర్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ ఓ లు రమేష్, లక్ష్మారెడ్డి డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి రాజేశ్వర్, ఏం హెచ్ ఓ డా.రాజేష్ టి ఓ రామకృష్ణ,ఈఈలు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో ప్రమాదాలను నివారించవచ్చు

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- ఎస్సార్ డిగ్రీ కళాశాల, బజాజ్ ఎలక్ట్రానిక్స్ లలో అగ్నిమాపక యంత్రాల పరిశీలన



**వరంగల్ మహా;** అప్రమత్తత ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. సోమవారం బాలసముద్రంలోని ఎస్సార్ డిగ్రీ కళాశాల తో పాటు వరంగల్ పరిధిలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ లో ఆయా సంస్థలు ఏర్పాటు చేసుకున్న అగ్నిమాపక యంత్రాల పనితీరును కమిషనర్ క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన తర్వాత నష్ట నివారణ చర్యలు చేపట్టే బదులు ముందస్తుగా అగ్నిమాపక యంత్రాలను అందుబాటు లో ఉంచుకొని పని చేసే విధంగా చేసుకుంటే ఆస్తి, ప్రాణ నష్టాన్ని గణనీయం గా తగ్గించవచ్చునని తెలిపారు. ఎస్సార్ కళాశాల లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక యంత్రాల ఏర్పాటు పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్ బజాజ్ ఎలక్ట్రానిక్స్ వారు మరికొన్ని పరికరాలు ఏర్పాటు చేసుకొని రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని ఫైర్ & సేఫ్టీ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అలాగే నగరంలోని ఆయా సంస్థలు ఫైర్, సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సెల్లార్ లలో విద్యుత్ సాంకేతిక సంబంధ ఉపకరణాలు లేకుండా చూడాలని, సెల్లార్లను కేవలం వాహనాలు నిలవడానికి మాత్రమే వినియోగించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారు.



## మరణించిన కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**

**జనగామ మహా;** జనగామ జిల్లా లోని దేవరుప్పుల మండలం, సింగరాజుపల్లి గ్రామానికి చెందిన మందుగులోజు వినయ్ కుమార్, రాపాక లక్ష్మి, నీర్మాల గ్రామానికి చెందిన బిఆర్ ఎస్ సీనియర్ కార్యకర్త బోడ లక్ష్మమ్మ, సోప్పరి వీరయ్య, కాసర్ల మంజుల ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వీరి నివాసాలకు వెళ్లి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్నికల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామ నాయకులు, యూత్, సోషల్ మీడియా నాయకులు, ఉన్నారు.



## ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక

**కాటారం, మహా :**మహాదేవపూర్ మండలంలోని 18 గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు చేసిన రూ 4,65,62,098 వెచ్చించారు. వేతన రూపంలో 3,32,24,593 లు, మెటీరియల్ రూపంలో 1,33,37, 505 లను చెల్లించారు. డబ్బులు చెల్లించిన డాక్యుమెంట్లు పూర్తిగా ఆడిట్ బృందానికి ఇచ్చారు. గ్రామాలలో తనికి బృందం వారం రోజులపాటు పర్యటించి డాక్యుమెంట్లలో, ఏం. బి లలో నమోదుచేసిన కొలతలను సరి చూసి, పని జరిగిన ప్రదేశంలో తనిఖీ బృందం సందర్శించి తనిఖీలో గుర్తించిన అవక తవకలకు, మండల కేంద్రంలో ప్రజా వేదికలో వెల్లడించారు. ప్రిసీడింగ్ అధికారి పెనాలిటీ , రికవరీ రూ. 30,219 విధించారు. బాధ్యులయిన సిబ్బందికి 15 రోజులలోగా నోటీసులు జారీ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటారని ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ప్రిసీడింగ్ అధికారిగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బాలకృష్ణ , జిల్లా విజిలెన్స్ ఇంచార్జి అధికారి రూబీ నా బేగం , క్వాలిటీ కంట్రోల్ విభాగం ధరం సింగ్, అంబుడ్స్మెన్ శ్రీనివాస్ గ, అదనపు కార్యక్రమాదికారి రమేష్, ఏపిఓ సునీత , సోషల్ ఆడిట్ స్టేట్ టీం మేనేజర్ అజయ్ , స్టేట్ రిసోర్స్ పర్సన్ గంగరాజు, వివిధ గ్రామపంచాయతీల పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, జూనియర్ ఇంజనీర్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదంతో టీపీసీసీలో ప్రధాన కార్యదర్శి పదవి దుద్దిల్ల శ్రీను బాబు



**కాటారం మహా :** మంథని నియోజకవర్గంలో ప్రజలకు సేవ చేసినందుకు రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ అభివృద్ధికి పాటుపడాలని సీఎం రేవంత్ రెడ్డి పిసిసి చీఫ్ మహేష్ గౌడ్ ల కోరిక మేరకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పదవి స్వీకరించినట్లు దుద్దిళ్ల శ్రీనుబాబు తెలిపారు. సోమవారం భూపాలపల్లి నుండి కాటారం వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మేడిపల్లి గ్రామం నుండి కాటారం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గారేపల్లి కూడలిలో అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. మంథని నియోజకవర్గంలో పదవి లేకుండా ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందించాలని ఇకముందు ప్రధాన కార్యదర్శి పదవితో మరింత సేవ చేసేందుకు కృషి చేస్తానని స్వర్గీయ శ్రీపాదరావు, మంత్రి శ్రీధర్ బాబు సోదరుని అండదండలతో వాళ్ల ఆశయ సాధనకు కృషి చేస్తానని శ్రీనుబాబు పేర్కొన్నారు. మహా ముత్తారం కాటారం భూపాలపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు శీను బాబుకు ఒక్కొక్కరుగా శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అయిత ప్రకాష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మాజీ ఎంపీపీ సంతకాని సమ్మయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమునూరు ప్రభాకర్ రెడ్డి, మంథని నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్, మండల శాఖ అధ్యక్షుడు చిటూరి మహేష్, నాయకులు నవీన్ రావు, దేవేందర్ రెడ్డి, నాయిని శ్రీనివాస్,కొట్టే శ్రీహరి, కొట్టే శ్రీశైలం, బెల్లంకొండ రామన్న, కామిడీ వెంకటరెడ్డి,చీమల రాజు, పసుల మొగిలి వివిధ గ్రామాల నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలతో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం

- 11 ఏళ్ల మోడీ సర్కార్ పాలనలో క్రమశిక్షణ, సుపరిపాలనతో అభివృద్ధికి కొత్త నిర్వచనం...
- బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర...



**కరీంనగర్ , మహా:** భారతీయ జనతా పార్టీ మాతృ సంస్థ , జనసంగ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను, ఆలోచనలను అమలు చేస్తూ, దేశాన్ని అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దేందుకు బిజెపి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని , 11 ఏళ్ల మోడీ సర్కార్ దేశంలో క్రమశిక్షణ, సుపరిపాలన రెండింటిని దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి కొత్త నిర్వచనాన్ని లిఖించిందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర అన్నారు. తిమ్మాపూర్ మండలం అలుగునూరు పరిధిలోని 134 పోలింగ్ బూత్ లో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలనుపురస్కరించుకొని ఆయనకు ఘన నివాళులు అర్పించి, మొక్కలు నాటారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఒక దేశంలో రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఇద్దరు ప్రధానులు కుదరదు అనే నినాదంతో భారతదేశ సమగ్రత , ఐక్యత కోసం చారిత్రక పోరాటం చేశారన్నారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగం , సిద్ధాంతాలు ప్రతి ఒక్కరిని స్ఫూర్తి నిస్తాయన్నారు. జమ్మూ కాశ్మీర్ ను భారతదేశంలో అంతర్భాగంగా మార్చేందుకు దేశాన్ని ప్రేరేపించి, ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం కోసం, 370 ఆర్టికల్ రద్దు కోసం పోరాడి బలిదానమైన యోధుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. దేశ రాజకీయాలు , విధానాలు, జాతి ప్రయోజనాలు , విద్య, సాంస్కృతిక , జాతీయవాదం వంటి రంగాలలో ప్రత్యేక ముద్ర వేసిన గొప్ప నాయకుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ అన్నారు . శామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలతో బిజెపి ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. గత దశాబ్ద కాలంలో మోడీ సర్కార్ సబ్ కా సాత్ సబ్ కా విశ్వాస్ సబ్ కా వికాస్ సబ్ కా ప్రయాస్ అనే మంత్రాన్ని అనుసరించి అన్ని మతాలు, కులాల ప్రజల హక్కులను సాధించడానికి, కాపాడడానికి బిజెపి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సామాజిక న్యాయం, జాతీయ ఐక్యత, ముక్కలుగా కనిపించని గొప్ప భారతదేశాన్ని శ్యామ ప్రసాద్ ముఖర్జీ కోరుకున్నారని,బిజెపి మోడీ ప్రభుత్వం ఆయన చూపిన బాటలోనే కొనసాగుతుందని తెలిపారు.

## మున్సిపాలిటీలోని దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

- లైసెన్స్ లేని దుకాణాలపై చట్టపరమైన చర్యలు
- కమిషనర్ కల్వకుర్తి మున్సిపాలిటీ




**రంగారెడ్డి జిల్లా మహా:** కల్వకుర్తి మున్సిపాలిటీ పట్టణ పరిధిలో నిర్వహిస్తున్న దుకాణ సముదాయాలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి అని మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు. పట్టణంలో వ్యాపారం చేస్తున్న వ్యాపార సంస్థలు అందరూ తమ షాపులకు పురపాలక సంఘం నుండి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొని ట్రేడ్ లైసెన్స్ పొందాలని కమిషనర్ వ్యాపారులకు ఆదేశించడం జరిగింది. ఆన్ లైన్ లో దరఖాస్తు చేస్తున్న వెంటనే, సిబ్బంది పరీక్షించిన తదుపరి కమిషనర్ డిజిటల్ సంతకంతో ట్రేడ్ లైసెన్స్ ఫైనల్ సర్టిఫికెట్ జారీ చేయడం జరుగుతుంది. కాబట్టి వ్యాపారస్తులు అందరూ ఇది గమనించి, ఇనిస్టెంట్ అప్రూవల్ నే ఫైనల్ సర్టిఫికెట్ అనుకోకుండా, డిజిటల్ సంతకం ఉన్న ట్రేడ్ లైసెన్స్ సర్టిఫికెట్ ని పొందాలని సూచించడం జరిగింది. అదేవిధంగా పురపాలక సిబ్బంది వ్యాపార దుకాణాలలో తనిఖీలు చేసినప్పుడు, ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపారస్తులపై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకొని జరిమానా విధించడం జరుగుతుందని తెలియజేశారు.

## అట్టహాసంగా మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణ పూజ

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని**



**హన్మకొండ మహా;** ప్రజలిచ్చిన అవకాశాన్ని వారి అభ్యున్నతి, అభివృద్ధి కోసమే నిత్యం పాటుపడతానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ అలంకార్ జంక్షన్ వద్ద రూ.705.84 లక్షల సీఎంఏ నిధులతో నిర్మించనున్న ఉమ్మడి జిల్లా మున్నూరుకాపు సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నాకు ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా ఓట్లు వేసి, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లి ఈ రోజు ఇంతటి మహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మీరిచ్చిన ఈ పదవి ప్రజల కోసమే పనిచేయలని కృతనిశ్చయంతో ముందుకు వెళ్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు , ఎమ్మెల్యేలు అందరం శంకుస్థాపన చేసిన ప్రతి పనిని నిర్ణీత సమయంలో పూర్తిచేస్తామని, కాలయాపన చేసే తత్వం మా ప్రభుత్వానికి లేదని అన్నారు. సకాలంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తే ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తానని వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామని తెలిపారు. రాజకీయంగా, వ్యక్తిగతంగా నాకున్న మిత్రులలో అధికులు మున్నూరు కాపు వారేనని, నా అభ్యున్నతి ఆలోచనల్లో చాలా వరకు భాగస్వాములు అవుతున్నారని తెలిపిన ఎమ్మెల్యే నాయిని రానున్న రోజుల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల సమిష్టి కృషితో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

## రేషన్ కార్డుల దరఖాస్తులపై విచారణ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**భూపాలపల్లి, మహా :** ప్రజాపాలన, మీ సేవా కేంద్రాల్లో వచ్చిన రేషన్ కార్డులు దరఖాస్తులు విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఇందిరమ్మ ఇండ్లు కు ఉచిత ఇసుక సరఫరా, రేషన్ కార్డుల దరఖాస్తులు విచారణ, భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై రెవెన్యూ, పంచాయతి రాజ్, గృహ నిర్మాణ శాఖ, ఇరిగేషన్, మైనింగ్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుల దరఖాస్తుల విచారణ ప్రక్రియ ఐదు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణానికి అవసరమైన ఇసుకను జిల్లాలోని వనరుల నుండి ఉచితంగా ఇవ్వాలని సూచించారు. ఎక్కడ ఇసుక లభ్యత ఉందో నివేదిక ఇవ్వాలని, అక్రమాలకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో 48651 దరఖాస్తులు వచ్చాయని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. దరఖాస్తు దారులకు నోటీసులు జారీ చేయాలని, క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో విచారణకు టీములు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. డెస్క్ వర్క్ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిసిఎస్వో శ్రీనాద్, డిపిఓ వీరభద్రయ్య, మైనింగ్ ఏడి జయరాజ్, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, ఆర్డిఓ రవి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడీవోలు తదితరులు పాల్గొన్నారు.